


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

TELANGANA RISING
CURE - PURE - RARE

సంపుటి : 19 సంచిక : 43 | 23-04-2026 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00



## కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు.

2



## ఆర్థికంగా కుదేలవుతున్న ఇరాన్

ఇరాన్ ఆర్థికంగా కుదేలవుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. నేపథ్యంలో ఇరాన్ ఆదాయం పడిపోతున్నట్లు చెప్పారు.

2



## సీజ్‌ఫైర్ పొడిగిస్తూ ప్రకటన

:ఇరాన్‌తో సీజ్‌ఫైర్‌ను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన శాంతి చర్చలు రద్దు అయ్యాయి. ఇక అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా తన పాక్ పర్యటన రద్దు చేసుకున్నట్లు వైట్‌హౌజ్ ధ్రువీకరించింది.

2

# ఆర్టీసీ సమ్మెతో
# బస్సులకు రెస్ట్

- డిపోలకే పరిమితం అయిన బస్సులు
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నట్లు ఎండి వెల్లడి





చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వార్త 2లో





## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు.

2



## మాజీ సిఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

2



2

## సైబర్ నేరాలు పెరుగుతున్న వేళ

### బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం

### ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సిపి సజ్జన్నార్ లేఖ

సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్ ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' దర్యాప్తులో వెలుగుచూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై
# కెసిఆర్, హరీష్‌లకు ఊరట

### జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు



2

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది.



2

## డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

### వెంటనే సమ్మె విరమించి రండి

### ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

**హైదారబాద్, అక్షరకలం ప్రతినిధి**



ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చరించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

## స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన

## ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. అయితే, సీజ్ ÷ర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్‌÷ర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్యపరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతను అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపుల ద్వారా లేదా నేరుగా వివాదాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని అమెరికా పదేపదే చెబుతోంది.

# ఆర్థికంగా కుదేలవుతున్న ఇరాన్

## రోజుకు సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టం

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

ఇరాన్ ఆర్థికంగా కుదేలవుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ ఆదాయం పడిపోతున్నట్లు ఆచయన చెప్పారు. హోర్ముజ్‌ను తక్షణమే ఓపెన్ చేయాలని ఇరాన్ భావిస్తున్నదని, ఎందుకంటే వాళ్లకు నగదు కొరత ఏర్పడిందన్నారు. ప్రతి రోజూ ఆ దేశం సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టపోతున్నదని ట్రంప్ తెలిపారు. మిలిటరీకి, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. హోర్ముజ్‌ను మూసిన ఇరాన్ ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఆయన తెలిపారు. జలసంధిని బ్లాకేడ్ చేసినట్లు తాము చెప్పడం వల్లే ఇరాన్ దాన్ని మూయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం తన వద్దకు కొందరు వచ్చి హోర్ముజ్‌ను ఓపెన్ చేయాలని కోరారని, కానీ ఒకవేళ హోర్ముజ్‌ను తాము ఓపెన్ చేస్తే, అప్పుడు ఇరాన్‌తో డీల్ కుదుర్చుకోలేమన్నారు. ఒకవేళ ఆ దేశాన్ని మొత్తం పేల్చివేస్తే తప్ప మళ్లీ ఆ డీల్ కుదిరే అవకాశం ఉండదని ట్రంప్ అన్నారు.

# సీజ్‌ఫైర్ పొడిగిస్తూ ప్రకటన

## జెడి వాన్స్ ఇస్లామాబాద్ పర్యటన రద్దు

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

:ఇరాన్‌తో సీజ్‌ఫైర్‌ను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన శాంతి చర్చలు రద్దు అయ్యాయి. ఇక అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా తన పాక్ పర్యటన రద్దు చేసుకున్నట్లు వైట్‌హౌజ్ ధ్రువీకరించింది. ఈనెలలో రెండోసారి జేడీ వాన్స్ పాక్‌లో పర్యటించాల్సి ఉంది. ఇరానీ ప్రతినిధులతో ఓ డీల్ కుదుర్చుకునేందుకు ఆ ట్రిప్ జరగాల్సి ఉంది. కానీ కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో వాన్స్ జర్నీ నిలిపివేశారు. అయితే ఒకవేళ వ్యక్తిగత సమావేశాలు ఏమైనా ఉంటే దానిపై ప్రకటన చేస్తామని వైట్‌హౌజ్ అధికారులు చెప్పారు. ఇరాన్‌తో సీజ్‌÷ర్‌ను నిరవధికంగా పొడిగించడం పట్ల ట్రంప్‌కు థ్యాంక్స్ చెప్పారు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్. మా రిక్వెస్ట్‌ను ఆమోదించి సీజ్‌÷ర్ ప్రకటించడం సంతోషకరమని, దీని వల్ల దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతుంటాయని అన్నారు. పాకిస్థాన్‌పై విశ్వాసాన్ని, నమ్మకాన్ని ప్రదర్శించారని, ఇరాన్‌తో సమస్యను పరిష్కరించేందుకు దౌత్యపరంగా తమ ప్రయత్నాన్ని వీడబోమన్నారు. ఇరు దేశాలు సీజ్‌÷ర్‌ను కొనసాగిస్తూ సమగ్రమైన శాంతి ఒప్పందాన్ని కుదుర్చు కుంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ కూడా ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతించారు. ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇది కీలకమైన అడుగు అని, దీని ద్వార దౌత్యం నిర్వహించేందుకు మార్గం సులువు అవుతుందని, అమెరికా–ఇరాన్ మధ్య విశ్వాసం పెరుగుతుందని సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫానే డుజారిక్ తెలిపారు. సీజ్‌÷ర్‌ను ఉల్లంఘించకుండా, నిర్మాణాత్మకంగా చర్చలు నిర్వహించాలన్నారు. శాంతి చర్చల అంశంలో పాక్ ఇచ్చిన మద్దతును ఆయన ప్రశంసించారు.

# ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

## హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణెళిశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

## డిపోలకే పరిమితం అయిన బస్సులు

## డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన

## నగరంలో అద్దె బస్సులను తిప్పిన ప్రభుత్వం

## చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ

## కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు

## నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్

## కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నట్లు ఎండి వెల్లడి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు





పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్– ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్– రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు



తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్,హరీష్‌లకు ఊరట

## జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు, స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే మీడియా ముందుకు తీసుకురావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు ఊరట లభించిందని మాజీ సీఎం అడ్వకేట్ గండ్రమోహన్ రావు తెలిపారు. హైకోర్టు తీర్పుతో కమిషన్ రిపోర్టును చెత్తలో పడేయవచ్చన్నారు. సెక్షన్ 8 కింద విచారణ జరగలేదని చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే కమిషన్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తు చేయరాదని న్యాయస్థానం చెప్పిందని కేసీఆర్ అడ్వకేట్ గండ్రమోహన్ రావు వెల్లడించారు.

# మాజీ సిఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

## చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత

## మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

## ఆర్టీసీ డిపోల ఎదుట నేడు మహాధర్నాకు పిలుపు

## సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదన్న జెఎసి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉధృతం చేసేందుకు సన్నహాలు ప్రారంభించింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులే ఇప్పటి కిప్పుడు సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేయడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సమ్మెను ప్రారంభించ వలసి వచ్చిందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసేంతవరకు, 2021 వేతన సవరణ 30 శాతం తగ్గకుండా అమలు చేసేంతవరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేసే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు, అన్ని వర్క్ షాప్ లలో మహాధర్నాలను జయప్రదం జేయాలని జేసీసీ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అమరవీరులకు నివాళులర్పించి సమ్మెను ముందుకు తీసుకెళ్తామని.. కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాలయాపన కోసమే ప్రభుత్వం కమిటీ వేసిందని విమర్శించారు. కమిటీ అవసరం లేదని.. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే పక్రియను సర్కార్ వెంటనే ప్రారంభించాలని వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని.. వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతిచ్చాయని... మరో సకల జనుల సమ్మెగా మారుస్తామని అన్నారు. సమ్మెకు మంద కృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించాలని.. మరో సకల జనుల సమ్మె కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు.


# సైబర్ నేరాలు పెరుగుతున్న వేళ

## బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం

## ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సిపి సజ్జన్నార్ లేఖ

హైదరాబాద్,

సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్ ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' దర్యాప్తులో వెలుగుచూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు. ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధ్రువీకరణలో జరుగుతున్న నిర్లక్ష్యం ప్రధాన సమస్యగా ఉందని సీపీ పేర్కొన్నారు. బ్రాంచ్ స్థాయి అధికారులపై జవాబుదారీతనం నిర్ధారిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆర్బీఐ మార్గదర్శకాల అమలుపై తక్షణమే సిస్టమిక్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొంతమంది బ్యాంకు అధికారులే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేవైసీ వెరిఫికేషన్‌లో జరిగిన లోపాలు భద్రతా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సైబర్ నేరాలకు సహకరించిన బ్యాంకు అధికారులను గుర్తించి ఆర్బీఐకి నివేదించి వారిని శాశ్వత బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. మ్యూల్ అకౌంట్లపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్బీఐ,



బ్యాంకులు, పోలీసులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వేదికల్లో వచ్చే అధిక లాభాల ప్రకటనలను నమ్మవద్దని, 'డిజిటల్ అరెస్ట్' పేరిట వచ్చే బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 'గో÷–డలెన్ అవర్'లో 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

# తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి

## పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి

## మోడీ నేతృత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం

## ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం




**చెన్నై,**

:తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని.. చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఎ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ పక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది. ??ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం' అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు.

# ఫార్మాసిటీ భూముల్లో సాగు కుదరదు

## రైతులను హెచ్చరించిన అధికారులు

## క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన

**రంగారెడ్డి,**

ఫార్మాసిటీ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు ఇకపై అక్కడ వ్యవసాయం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఆర్డీవో అనంతరెడ్డి శనివారం స్వయంగా పరిశీలించారు. నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి అసైన్డ్ భూముల స్థితిగతులను అంచనా వేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. గతంలోనే ఫార్మాసిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 14 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. ఈ భూములకు సంబంధించి రైతులకు ఇప్పటికే పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించడం జరిగిందని ఆర్డీవో గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందుకున్న రైతులు, రాబోయే వర్షాకాలం సీజన్‌లో సేకరించిన భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు వేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయవద్దని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నష్టపరిహారం పొందిన తర్వాత ఆ భూమిపై హక్కులు ప్రభుత్వానికే ఉంటాయని, కాబట్టి అక్కడ వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. రైతులు అధికారుల సూచనలను పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ అయ్యప్పతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ శివార్లలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గత కొంతకాలంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తోంది. గతంలో భూసేకరణ సమయంలో కొన్ని గ్రామాల రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. మెజారిటీ రైతులకు పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూములను అభివృద్ధి పనులకు సిద్ధం చేస్తున్న తరుణంలో.. అక్కడ మళ్లీ సాగు చేపడితే పనులకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులు ఎవరైనా ఆదేశాలు ధిక్కరించి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

# దస్తగిరి హత్యపై ప్రభుత్వం సీరియస్

## నిత్యానంద రెడ్డి కోసం పోలీసుల గాలింపు

**కడప,**

నగరంలో జరిగిన వైసీపీ కార్యకర్త పెద్దదస్తగిరి హత్య కేసుపై ప్రభుత్వం సీరియస్ అయింది. పోలీసులు లోతుగా విచారణ చేస్తూ కేసును అన్ని కోణాల నుంచి పరిశీలిస్తున్నారు. హత్య వెనుక ఉన్న కారణాలను బయటపెట్టడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. దస్తగిరి హత్యతో సంబంధం ఉన్న వైసీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. నిత్యానంద రెడ్డిని వీలైనంత త్వరగా అరెస్ట్ చేసి విచారించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.హతుడు పెద్దదస్తగిరి ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో వైసీపీ నేతలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 145 ఎకరాల భూములకు సంబంధించిన పత్రాలు ఉన్నాయి. ఈ భూముల మొత్తం విలువ 100 కోట్ల రూపాయలకు పైగా ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి నివాసంలో గత రాత్రి నాలుగు గంటల పాటు పోలీసులు తనిఖీలు చేపట్టారు. పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు చేపట్టిన విచారణతో వైసీపీ నేతల్లో టెన్షన్ నెలకొంది.

# తమిళనాడు ఘటన తరహాలో కేరళలో ఘటన

## బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

## ఆరుగురు మృతి..40 మందికి గాయాలు

**తిరువనంతపురం**

తమిళనాడు విరుదునగర్‌లోని బాణసంచాలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువక ముందే.. కేరళలో మరో విషాదం నెలకొంది. త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా ఉత్పత్తి కేంద్రంలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందారు. మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. త్రిస్సూర్ తిరువంబడిలోని ఓ బాణసంచా తయారీ యూనిట్లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 24న జరగాల్సిన నమూనా బాణసంచా కోసం ఆ కేంద్రంలో సామగ్రిని ఉత్పత్తి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ఆ శబ్దం సుమారు కొన్ని కిలోమీటర్ల మేర వినిపించినట్టు స్థానికులు తెలిపారు. తొలుత దీన్ని భూప్రకంపనలుగా భావించినట్టు వారు తెలిపారు. పేలుడు అనంతరం ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అయితే.. నల్లటి పొగలు, మరోసారి పేలుడు సంభవించిన కారణంగా సహాయక చర్యలు కష్టతరంగా మారాయని అక్కడి అధికారులు వెల్లడించారు. ఆ యూనిట్లో పేలని బాణసంచా పదార్థాలు ఇంకా ఉన్నాయనే అనుమానంతో.. అత్యంత జాగ్రత్తగా సహాయక కార్యకలాపాలు సాగుతున్నాయి. పేలుడుకు గల కచ్చితమైన కారణాలేమిటో ఇంకా తెలియరాలేదు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

## ఉపాధి హామీని మరింతగా విస్తరించాలి

## ఎక్స్ వేదికగా జగన్ పోస్ట్

**అమరావతి**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ మద్దతు క్రమంగా తగ్గిపోతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. గ్రామీణ ప్రజలకు కీలకంగా ఉపయోగపడేజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం సమర్థవంతంగా అమలు కావడం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల చేతిలో ఖర్చు చేయగలిగే ఆదాయం పెరుగుతుందని, దాంతో గ్రామీణ మార్కెట్లలో వినియోగం పెరిగి ఆర్థిక చలనం వస్తుందని వివరించారు. ఎక్కువగా ఖర్చు చేసే వర్గాల చేతిలో డబ్బు ఉంటే గ్రామీణ ఆదాయ వినియోగం పెరుగుతుందని, అది మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని అన్నారు వైఎస్ జగన్. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంజీఎన్ఆర్ఈజీఏ అమలులో దేశవ్యాప్తంగా అగ్రగామి రాష్ట్రంగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. అయితే, గత రెండేళ్లుగా టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనితీరు తీవ్రంగా పడిపోయిందని జగన్ విమర్శించారు. లేబర్ బ్జడెట్, పని చేసిన కుటుంబాల సంఖ్య, ఖర్చు చేసిన నిధులు వంటి అన్ని అంశాల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోందని ఆరోపించారు. గత రెండేళ్లలో జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ వృద్ధి రేట్లు కూడా తగ్గాయని జగన్ తెలిపారు. ఇది ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందనే సంకేతమని అన్నారు.

# వైసిపి రాజకీయ పార్టీ కానేకాదు

## రాజకీయ హత్యలకు డెన్‌గా మారింది

## పార్టీ అనుమతులపై ఇసి ఆలోచన చేయాలి

## దస్తగిరి హత్యతో వైసిపి నైజం మరింత బయటపడింది

## మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు

**అమరావతి,**

వైసీపీ రాజకీయ పార్టీ కాదని.. హత్య రాజకీయాలకు డెన్‌గా తయారైందని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత వైసీపీకి లేదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ అనుమతులపైన ఎలక్షన్ కమిషన్ కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనక ఆ పార్టీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పార్టీ చేసిందని విమర్శించారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. చీకట్లో చంపడం.. పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి ఇంట్లో వందల కోట్ల విలువ చేసే డాక్యుమెంట్లు దొరికాయని మంత్రి కొలుసు పార్థసారథి ప్రస్తావించారు. జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లు, హత్యకు గురైన పెద్ద దస్తగిరి ఇంట్లో ఎలా లభించాయని ప్రశ్నించారు. హత్యకు గురైన పెద్ద దస్తగిరి.. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్యుడని చెప్పుకొచ్చారు. ఆస్తులు, అధికారం కోసం వైసీపీ నేతలు ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి, పెద్ద దస్తగిరి హత్య వరకు వైసీపీ ఒకే తరహా నాటకమాడుతోందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి హత్యకు ప్రధాన కారకులైన వారు.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన పాపాలను ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వైసీపీని ఒక రాజకీయ పార్టీగా ప్రజలు చూడటం లేదని.. రాజకీయాల్లో కొనసాగే అర్హత ఆ పార్టీకి లేదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ధనదాహం, అధికారదాహానికి ఎవరు అడ్డొచ్చినా తల్లైనా, చెల్లైనా, బాబాయ్ అయినా ఎవరైనా ఒకటేనని ఎద్దేవా చేశారు. జగన్ క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారనే విషయాన్ని.. వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాలని అన్నారు. పెద్ద దస్తగిరి హత్య, బాబాయ్ హత్య, జగన్ కారు చక్రాల కింద నలిగిన కార్యకర్త ఇలా ఎన్నో ఉదాహరణలు జగన్ నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి సొంత పార్టీకి చెందిన దస్తగిరిని హత్య చేయటం జగన్ స్వార్థాన్ని తెలుపుతోందన్నారు. తాడేపల్లిలో తనకున్న అనుబంధంలో భాగంగానే దస్తగిరి హత్య జరిగిందని ఆరోపించారు. హింసా రాజకీయాలు నడిపే వారికి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. వైసీపీకి ఏపీలో చోటు లేకుండా చేయాలని మంత్రి సూచించారు.

# పెద్దదస్తగిరి హత్యపై సిబిఐతో విచారణ చేయించండి

## ప్రస్తుత విచారణ అధికారిపై నమ్మకం లేదు

## మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి భార్య దీప్తి

**కడప,**

రియల్ ఎస్టేట్ వ్యాపారి, వైసిపి నేత పెద్ద దస్తగిరి హత్యలో తన భర్త మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని ఆయన సతీమణి బండి దీప్తి వెల్లడించారు. మంగళవారం అంగడి వీధిలోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్ద దస్తగిరి హత్య కోణం, హత్య విచారణ కోణం వేరువేరుగా ఉన్నాయని పేర్కొన్నారు. తన భర్తకు పెద్ద దస్తగిరికి స్నేహ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఎటువంటి వ్యాపార లావాదేవీలు లేవని చెప్పారు. పెద్ద దస్తగిరి ఇంట్లో నూరు కోట్లు విలువ చేసే డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారని, ఇందులో ఒక లక్ష రూపాయలైనా,ఒక సైట్ అయినా దస్తగిరితో తన భర్త అగ్రిమెంట్ చేసుకోలేదని పేర్కొన్నారు. అలా లావాదేవీలు ఉన్నట్లు నిరూపించాలని తెలిపారు. పెద్ద దస్తగిరి హత్య జరిగిన వారం తర్వాత విచారణ అధికారిని మార్చివేశారని చెప్పారు. ప్రస్తుత ఉన్న అధికారిపై తనకు అనుమానం ఉందన్నారు. కేసును తప్పుదోవ పట్టిస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నట్లు గత అనుభవాల దృష్ట్యా అర్థం అవుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసిపి ని, తన భర్తను టా÷-గ్గ్ ÷ట్ చేసినట్లు భావిస్తున్నామన్నారు. విచారణ పారదర్శకంగా కొనసాగేందుకు తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. భర్త నిత్యానందరెడ్డి తనకు అందుబాటులోకి వస్తే మీడియా సమక్షంలో లొంగిపోవాలని చెబుతానని పేర్కొన్నారు. నిజా నిజాలు నిర్ధారణ కాకుండానే తన భర్తను బలి పశువును చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సిబిఐ, సిట్ తో విచారణ చేయించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న విచారణ అధికారిపై తమకు నమ్మకం లేదని తెలిపారు. ఎస్పీ తమ అభ్యర్థనను ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. 16 సంవత్సరాల వైవాహిక జీవితంలో తన భర్త ఎలాంటివాడో నాకు బాగా తెలుసునని కన్నీటి పర్యంతమయ్యారు. విచారణకు అన్ని విధాల సహకరిస్తామని చెప్పారు.

# తమిళనాడు తీరప్రాంతానికి వర్షహెచ్చరిక

**చెన్నై,**

తమిళనాడు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల తీరప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు చెన్నై ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ఉత్తర కర్ణాటక నుంచి రాష్ట్రం మీదుగా మన్నార్‌వలైకుడ వరకు ఉపరితల ఆవర్తనం నెలకొంది. ఈ కారణం గా, పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాలు, దక్షిణ జిల్లాల సముద్రతీరప్రాంతాల్లో మంగళ, బుధవారా ల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. తూణరాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుంది. రాష్ట్రంలోని అంతర్ జిల్లాల్లో ఈ నెల 23వ తేది వరకు ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటూ గరిష్ట ఉష్ణోగ్రత 37 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
సంపాదకీయం...

# వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది.వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్ధతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది.

పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చుని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. సాగునీటికి అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంక్ల్యం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకలు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా




పూనుకుంటే తప్ప- అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఎపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

## కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

## మండల విద్యాధికారి రాథోడ్ రమేష్

## పట్టణంలోని ఫిల్టర్ బెడ్ పాఠశాలలో అంగరంగ వైభవంగా కాన్వోకేషన్ డే ఉత్సవాలు

**మందమర్రి, ఏప్రిల్ 22 అక్షర కలం:**






ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన జ్ఞాన నిర్మాణం కోసం పరితపించే ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తున్నారని మండల విద్యాధికారి రాథోడ్ రమేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని, పై తరగతులకు వెళ్లుతున్న విద్యార్థులకు కాన్వోకేషన్ డే వేడుకలు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి రాథోడ్ రమేష్ హాజరై, ఐదో తరగతి విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిల్టర్ బెడ్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల కృషి వల్ల దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందడమే కాకుండా నాణ్యమైన మెరుగైన విద్యను పిల్లలకు అందించడంలో ముందంజలో ఉందని కొనియాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని ఉపాధ్యాయులు అహర్నిశలు చేస్తున్న కృషికి తల్లిదండ్రులు సహకరిస్తున్న విధానంతో మండలంలోనే ఉన్నతమైన పాఠశాలగా ఈ పాఠశాల నిలిచిందన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, విద్యార్థులు అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నాయని తెలిపారు. వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తూ, శాస్త్రీయ పద్ధతులలో, ప్రత్యక్ష బోధన పద్ధతులతో విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నాయన్నారు. మండలంలోని అత్యధిక విద్యార్థులు ఫిల్టర్ బెడ్ ఎంపిపిఎస్ పాఠశాలలో చేరి, విద్యను అభ్యసిస్తున్నారని, ఈ పాఠశాల ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరుకాగా, ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం వీక్షకులను విశేషంగా అలరించాయి. ముఖ్యంగా అంబేద్కర్ ఆశయాల రూపకంగా విద్యార్థులు చేసిన నృత్య రూపకం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైద్య శ్రీనివాస చారి, ఉపాధ్యాయులు జనగామ ఉమాదేవి, భీం పుత్ర శ్రీనివాస్ జలంపెల్లి, చింతకింది లలిత, గుడివెనుక రవి, మంజుల, అమ్మ ఆదర్శం పాఠశాల చైర్మన్ దూలం అంజలి, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చారి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి

## బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**అక్షర కలం బీబీనగర్**



బీబీనగర్ మండల పరిధిలోని జైనపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి దేవతల శ్రీశైలం, గొర్రెల దొడ్డిపై మంగళవారం రాత్రి వీధి కుక్కలు దాడిచేసి 13 గొర్రెలను చంపేశాయి. మృతి చెందిన గొర్రెలను చూసిన శ్రీశైలం కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆర్థికంగా నష్టపోయిన శ్రీశైలం ను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. బాదిత కుటుంబాన్ని గ్రామ నాయకులు నకీర్తి గణేష్ ముదిరాజ్, చంద్రమౌళి గౌడ్ లు ఓదార్చారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయాన్ని ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో వీధి కుక్కలు బెడద లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# నవాబ్‌పేటలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**తహసీల్దార్ కార్యాలయం, కేజీబీవీ, పీహెచ్‌సీ పరిశీలన -- సేవల మెరుగుపై ఆదేశాలు**

నవాబ్‌పేట. ఏప్రిల్ 22.అక్షర కలం : జిల్లాలో ప్రభుత్వ సేవల అమలుపై మరింత పట్టు సాధించేందుకు జిల్లా కలెక్టర్ మేడమ్ గురువారం నవాబ్‌పేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, సౌకర్యాల స్థితిగతులు, అధికారుల పనితీరుపై వివరణలు కోరుతూ పలు సూచనలు చేశారు. మొదట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై విచారణ జరిపారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల వివరాలు తెలుసుకుని, వాటిని వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలు ఆలస్యం కాకుండా సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, పారదర్శకత, ప్రజలతో వ్యవహరించే విధానంపై కూడా సూచనలు చేశారు. అనంతరం కేజీబీవీని సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువుల స్థాయి, వసతి సౌకర్యాలు, ఆహార నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. హాస్టల్ గదులు, వంటశాల, భోజనశాలను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, వారి ఆరోగ్యం, భద్రతపై కూడా నిరంతరం శ్రద్ధ పెట్టాలని చెప్పారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలుసుకుని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, చికిత్స విధానాలను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. గర్భిణీ స్త్రీలు, చిన్నారులకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అత్యవసర సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో అమలవుతున్న పథకాలపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలని, ప్రతి శాఖ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, మెడికల్ ఆఫీసర్, ఎంఫీఓ, ఆర్ఐలు, ఏపీఓ, ఏఈ (హౌసింగ్) తదితర అధికారులు పాల్గొన్నారు.





# బస్సు సేవలకు అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు

**ప్రజా రవాణా భద్రతకు పోలీసుల కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22. అక్షర కలం :**

ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో జిల్లాలో ప్రజా రవాణా సౌకర్యం ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు పోలీసు శాఖ విస్తృత భద్రతా చర్యలు చేపట్టింది. ప్రైవేట్ బస్సులు నడుపుతున్న డ్రైవర్లు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సూచించారు. పోలీసుల నుంచి పూర్తి భద్రత కల్పిస్తున్నామని, డ్రైవర్లు నిరభ్యంతరంగా తమ విధులు నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీ బస్సులను ప్రైవేట్ వ్యక్తులు నడుపుతున్నందున, బస్సుల ప్రయాణానికి ఎలాంటి అడ్డంకులు సృష్టించినా, మార్గమధ్యంలో వాహనాలను ఆపినా, డ్రైవర్లపై దాడులకు పాల్పడినా వాటిని చట్టవిరుద్ధ చర్యలుగా పరిగణిస్తామని హెచ్చరించారు. అలాంటి ఘటనలపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజా రవాణా సేవలను భంగం కలిగించే ప్రయత్నాలను ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేసిన ఎస్పీ, ఉద్దేశ పూర్వకంగా అల్లర్లు సృష్టించడం, ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించడం, అధికారులపై దాడులు చేయడం వంటి చర్యలపై కూడా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, వదంతులు వ్యాప్తి చేసే వారిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమ్మెలో పాల్గొనే కార్మికులు, ప్రజలు పరస్పర గౌరవంతో వ్యవహరించి ఉద్రిక్తతలకు తావు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల శాంతి భద్రతలను కాపాడటంలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరిన ఎస్పీ, ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.



# విద్యకు వెలుగులు నింపిన జీనుగురాల... విగ్రహాల ఆవిష్కరణతో జ్ఞానోత్సవం


దేవరకద్ర మండలం జీనుగురాల గ్రామంలో విద్యా ప్రాధాన్యాన్ని ప్రతిబింబించే అరుదైన కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ఆవిష్కరించారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విగ్రహాల ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ విద్యే సమాజ అభివృద్ధికి మూలస్తంభమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, గత బీఆర్ఎస్ పాలనలో విద్యాశాఖ నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన ఆధీనంలో ఉంచుకుని, విద్యా వ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. తాను ఇచ్చిన హామీల మేరకు నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, స్కూల్ షూస్, టైలు, బెల్టుల అందజేత వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా నాణ్యమైన విద్య పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా జీనుగురాల, డోకూర్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, అధికారులు, యువకులు, మహిళలు భారీగా పాల్గొని కార్యక్రమానికి విశేష స్పందన తెలిపారు.





అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట





# ఐపీఎల్ 2026 ఫైనల్ వేదిక ఫిక్స్..

ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌కు ఏ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుందనే ఉత్కంఠకు దాదాపు తెరపడింది. ఫైనల్ మ్యాచ్ వేదిక గురించి అధికారిక ప్రకటన రాకముందే, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టాడు. ఈ ఏడాది జరిగే ప్రతిష్టాత్మక టైటిల్ పోరుకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యం ఇవ్వనున్నట్లు అతడు స్పష్టం చేశాడు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ ఏడాది ఐపీఎల్ షెడ్యూల్‌ను రెండు దశల్లో విడుదల చేసిన విషయం క్రీడాభిమానులకు తెలిసిందే. అయితే, ప్లేఆఫ్స్ తో పాటు ఫైనల్ మ్యాచ్‌ల వేదికలను బీసీసీఐ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. కానీ, శనివారం మధ్యాహ్నం ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ చేసిన వ్యాఖ్యలు ఫైనల్ వేదికపై పూర్తి స్పష్టతనిచ్చాయి. పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ఇస్తూ ఐకానిక్ గ్రీన్ జెర్సీ ధరించి టాస్ కోసం వచ్చిన పాటిదార్ మాట్లాడుతూ.. "చిన్నస్వామి స్టేడియాన్ని మాకు ఎవరూ బద్దలు కొట్టలేని కోటగా మార్చేందుకు చాలా ప్రణాళికలు రచించాం. ఈ ఏడాది ఫైనల్ మ్యాచ్ ఇక్కడే జరగనుందని మాకు ముందే తెలుసు. అందుకే మా సొంత మైదానంలో జరిగే అన్ని మ్యాచ్‌లలో తప్పక గెలవాలని బరిలోకి దిగుతున్నాం" అని ఎంతో ధీమాగా చెప్పాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీ.. తమ సొంత అభిమానుల మధ్య టైటిల్‌ను కాపాడుకునే అద్భుతమైన అవకాశం దక్కించుకోనుంది. రజత్ పాటిదార్ నాయకత్వంలో ఆడుతున్న ఆర్సీబీ ఈ సీజన్‌లో అన్ని విభాగాల్లోనూ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. ఇప్పటివరకు వారు ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఏకంగా నాలుగు అద్భుత విజయాలు నమోదు చేసి తమ సత్తా చాటింది. ఇందులో ముఖ్యంగా మూడు విజయాలు తమ సొంతగడ్డ చిన్నస్వామి స్టేడియంలోనే రావడం విశేషం. సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ లాంటి అత్యంత బలమైన జట్లపై ఆర్సీబీ ఘన విజయాలు సాధించింది. ఆటగాళ్లంతా సమష్టిగా రాణిస్తుండటంతో తమ హోమ్ గ్రౌండ్‌లో విజయపరంపరను కొనసాగిస్తామని పాటిదార్ గట్టి నమ్మకంతో ఉన్నాడు. ప్రస్తుత లీగ్ దశలో ఆర్సీబీకి చిన్నస్వామి స్టేడియంలో మరో రెండు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్, కేఎల్ రాహుల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ జట్లతో ఆర్సీబీ తలపడనుంది.




# ఐసీయూలో చేరిన షాపూర్ జాద్రాన్

ఆఫ్ఘనిస్తాన్ క్రికెటర్ షాపూర్ జద్రాన్ తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాడు ప్రస్తుతం ఈ ఫాస్ట్ బౌలర్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. పాకిస్తాన్ క్రికెటర్ ఉమర్ అక్మల్ ఆసుపత్రిలో షాపూర్ జద్రాన్ ఉన్న కొన్ని ఫోటోలను షేర్ చేసి, అతడు త్వరగా కోలుకోవాలని ప్రార్థించాడు. తాను జద్రాన్ సోదరుడితో మాట్లాడానని, అతడి ఆరోగ్యం గురించి తెలుసుకుని చాలా బాధపడ్డానని షాహిద్ అఫ్రిది పేర్కొన్నాడు. 38 ఏళ్ల షాపూర్ జద్రాన్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో అతడ్ని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆఫ్ఘాన్ క్రికెటర్ డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్నాడు. పాకిస్తాన్ మాజీ క్రికెటర్ ఉమర్ అక్మల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్‌లో షాపూర్ జద్రాన్ ఫోటోలను షేర్ చేశాడు. ఇది చూసిన ఆఫ్ఘాన్ క్రికెటర్ ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. అతడె త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. ఉమర్ అక్మల్ ఎక్స్ ఖాతాలో షాపూర్ జద్రాన్ ఫోటోను షేర్ చేస్తూ భావోద్వేగానికి లోనయ్యాడు. షాపూర్ జద్రాన్ సోదరుడు నాకు స్నేహితుడు లాంటివాడు. క్రికెటర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని' పోస్ట్ చేశాడు. షాహిద్ అఫ్రిది కూడా షాపూర్ జద్రాన్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించాడు. ఫోన్‌లో జద్రాన్ సోదరుడితో మాట్లాడానని అఫ్రిద్ తెలిపాడు. ఆ కుటుంబానికి తమ మద్దతు ఉంటుందన్నాడు.'షాపూర్ జద్రాన్ సోదరుడితో ఫోన్‌లో మాట్లాడాను. ఆఫ్టాన్ బౌలర్ పరిస్థితి గురించి విని చాలా బాధపడ్డాను. అతడు ఎల్లప్పుడూ మైదానంలో పోరాడే యోధుడు. ఈ కష్టాన్ని కూడా పోరాడి గెలుస్తారని నాకు నమ్మకం ఉంది. మీరు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని అఫ్రిద్ తన పోస్టులో రాసుకొచ్చాడు.

# అభిషేక్ శర్మ విశ్వరూపం..

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ సంచలనం అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. చెన్నై సూపర్ కింగ్స్ తో జరుగుతున్న 27 మ్యాచ్‌లో పరుగుల సునామీ సృష్టించాడు. ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 15 బంతుల్లోనే అద్భుతమైన అర్ధ శతకం సాధించి, ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. ఇందులో 5 ఫోర్లు, 4 సిక్సులు ఉన్నాయి. సొంతగడ్డపై హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లకు అభిషేక్ శర్మ చుక్కలు చూపించాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఎడాపెడా బౌండరీలు, భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఏ బౌలర్ వేసినా బంతిని మైదానం వెలుపలికి పంపడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో కేవలం 15 బంతుల్లోనే తన అర్ధ శతకాన్ని పూర్తి చేసి అందరినీ విస్మయానికి గురిచేశాడు. అతని విధ్వంసకర ఇన్నింగ్స్ తో పవర్ ప్లే లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. బంతిని ఎదుర్కొన్న ప్రతిసారీ ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపించిన ఈ యువ ఎడమచేతి వాటం బ్యాటర్.. మైదానం నలుమూలలా అద్భుతమైన షాట్లు ఆడాడు.చెన్నై సూపర్ కింగ్స్ ఎంత పకడ్బందీ ప్రణాళికలతో బరిలోకి దిగినా, అభిషేక్ తుఫాను ముందు ఆ వ్యూహాలేవీ పనిచేయలేదు. స్పిన్నర్లు, పేసర్లు అనే తేడా లేకుండా అందరినీ దారుణంగా శిక్షించాడు. బంతి పడటమే ఆలస్యం అన్నట్లుగా కళ్లు చెదిరే కట్ షాట్లు, కవర్ డ్రైవ్ లు, భారీ సిక్సర్లతో మైదానాన్ని హోరెత్తించాడు. అతని బ్యాటింగ్ దాటికి ఫీల్డింగ్ ఎక్కడ పెట్టాలో అర్థం కాక చెన్నై నాయకత్వం తలపట్టుకుంది. ప్రతి బంతినీ బౌండరీ లైన్ దాటించాలనే కసితో ఆడిన అభిషేక్, క్రీడాభిమానులకు అసలు సిసలైన టీట్వంటీ వినోదాన్ని పంచాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



# సినిమా
CINEMA

# యూత్ మూవీకి రిషబ్ శెట్టి ఫిదా


ఇటీవల విడుదలై మంచి ఆదరణ సొంతం చేసుకుంటోంది 'యూత్' మూవీ. ఇప్పటికే దీనిపై ఎంతోమంది సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించగా.. తాజాగా రిషబ్‌శెట్టి కూడా దీనికి ఫిదా అయ్యారు. ఎక్స్ వేదికగా దీనిపై పోస్ట్ పెట్టారు. చాలాకాలం తర్వాత, ఒక సినిమా చూస్తున్నంతసేపు నేను నవ్వుతూనే ఉన్నాను. 'యూత్' సినిమాలో ఎన్నో భావోద్వేగాలున్నాయి. తల్లిదండ్రులకు ఇచ్చిన గొప్ప బహుమతి 'యూత్'. తెరపై నటీనటులంతా చాలా సహజంగా కనిపించారని రిషబ్ అన్నారు. దర్శకుడి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన రిషబ్ (ఖీతిబరజీశి ÷ూఠ।బిబా).. సినిమా రంగానికి కెన్ కరుణాస్ ఒక గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. 'యూత్' కథేంటంటే..: మధ్యతరగతి కుటుంబానికి చెందిన టీనేజర్ ప్రవీణ్ (కెన్ కరుణాస్). అతడి అల్లరి పనుల వల్ల స్కూల్‌లో ఏ అమ్మాయి తనవైపు కన్నెత్తి కూడా చూడదు. కానీ, ప్రవీణ్ మాత్రం తన స్కూల్ లైఫ్ పూర్తయ్యేలోపు ప్రేమించాలన్న లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ క్రమంలోనే గంగవల్లి (అనీషా అనిల్ కుమార్), ప్రేషిక (మీనాక్షి దినేష్), సోనాల్ (ప్రియాన్షీ యాదవ్) తన జీవితంలోకి వస్తారు. మరి ఆ ముగ్గురి వల్ల ప్రవీణ్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ప్రేమ, బ్రేకప్, అవమానాలు లాంటి అనుభవాలతో అతడు నేర్చుకున్న జీవిత పాఠమేంటి? ఈ ప్రయాణంలో తన తల్లిదండ్రులు ఉన్నికృష్ణన్ (సూరజ్ వెంజరమూడు), సరోజ (దేవదర్శిని) పాత్రలకి ఉన్న ప్రాధాన్యం ఏంటి? వారి కలల్ని హీరో నెరవేర్చాడా? అన్నది మిగిలిన కథ.





# బాబూబూ మోహన్‌కు రేలంగి అవార్డు

హాస్యనటచక్రవర్తి పద్మశ్రీ రేలంగి అవార్డును నటుడు డా.బాబుమోహన్ అందుకున్నారు. 41ఏండ్ల నటజీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు ఫిల్మ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫార్మ్ అండ్ భారత్ కల్చరల్ అకాడమీ సంస్థ ఆయనకు ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, నాగబాల సురేశ్, నటుడు రాంకీ, 30ఇయర్స్ పృథ్వీరాజ్ తదితరులు అతిథులుగా పాల్గొని తెలుగు సినిమాకు బాబుమోహన్ చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. బాబుమోహన్ మాట్లాడుతూ 'రేలంగి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ 41ఏండ్ల నట జీవితంలో నన్ను పోత్సహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నాను. అవార్డుల కంటే ప్రజల ఆశీస్సులే గొప్ప దీవెన. ఇక 'పద్మ' అవార్డు వస్తే సంతోషం. రాకపోయినా ఫర్వాలేదు' అని బాబుమోహన్ అన్నారు.



# హోంబలే నుంచి మహావతార్ పరశురామ్

కేజీఎఫ్, కాంతారా, సలార్, మహావతార్ నరసింహ.. ఇలా వరుస బ్లాక్‌బాస్టర్స్‌తో సినిమా స్థాయిని పెంచిన నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి రాబోతున్న మరో యానిమేటెడ్ దృశ్యకావ్యం 'మహావతార్ పరశురామ్' రాబోతోంది. పరశురామ జయంతి సందర్భంగా 'మహావతార్' సినీమాటిక్ యూనివర్స్‌ని ప్రజెంట్ చేస్తూ ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని, గ్లింప్స్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గొడ్డలి చేతబట్టి నరమేధాన్ని సృష్టిస్తున్న పరశు రాముడ్ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పరశురాముడి ముఖాన్ని చూపించకుండా, ఆయన చేతిలో రక్తంతో తడిసిన పరశు ను(గొడ్డలి), రక్తంతో తడిచి ముద్దయిన యుద్ధభూమిని, దూరంగా భీతితో చూస్తున్న సైన్యాన్ని పోస్టర్‌లో చూపిస్తూ కథపై మరింత ఆసక్తిని పెంచారు మేకర్స్. మహావిష్ణు అవతారాల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కథ మోడ్రన్ విజువల్ వండర్‌గా, గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో అలరిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.




# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలుకుదాం...దరిత్రిని కాపాడుకుందాం

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్
## నల్గొండలో ఉత్సాహంగా సాగిన సైకిల్ ర్యాలీ

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కారణంగా దరిత్రితోపాటు, ప్రకృతి పెను విపత్తును ఎదుర్కొంటున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృ భూమి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని కేంద్రీయ విద్యాలయ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీని కేంద్రీయ విద్యాలయ వద్ద ఆయన జండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, మీడియాను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ప్రపంచం పెను ప్రమాదంలో చిక్కుకుందని, దీనివల్ల వాతావరణ, జల, భూమి కాలుష్యాలు ఏర్పడుతున్నాయని అన్నారు. మానవ తప్పిదాలు, వివాదాల వల్ల మనుషులతో పాటు, జంతుజాలానికి కూడా ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం అనంతరం డీకంపోస్టు చేయకపోవడం వల్ల ఇది భూమితోపాటు, ప్రకృతిని నాశనం చేస్తున్నదని, దీని నుండి బయట పడేందుకు ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున మొక్కలు నాటి దరిత్రిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు . మొక్కలు నాటి సంరక్షించడంతోపాటు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, ఒక వేళ వాడినట్లైతే తిరిగి దానిని వినియోగించడం, రీసైకిల్, చేయడం వంటి వాటిపై దృష్టి సారించాలని, ఈ నినాదం ప్రతి గృహానికి వెళ్లే లా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అప్పుడే మనం భూమిని, ప్రకృతిని కాపాడగలుగుతామని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం లో భాగంగా ప్రతి ఒక్కరూ బయటికి,లేదా మార్కెట్ కు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా కాటన్ చేతి సంచులు వాడాలని, ప్లాస్టిక్ వాటర్ బాటిల్ కు బదులు స్టీల్ లేదా మట్టి బాటిల్స్ వాడడం, ప్లాస్టిక్ మెటీరియల్ వాడకుండా చూడాలని, ఈ విషయంపై అన్ని చోట్ల అవగాహన కల్పించాలని తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్నిచోట్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ప్రకృతిని కాపాడే అంశంపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు."అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం" సందర్భంగా ప్రతి ఒక్కరు భూమి కి ప్రతిరూపమైన అమ్మను గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకునే ప్రయత్నం చేయాలని, అప్పుడే మనం అనుకున్న అందమైన జీవితాన్ని గడపగలుగుతామన్నారు. డి ఎఫ్ ఓ రాజశేఖర్, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి తదితరులు ఈ సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీకి హాజరైన వారందరి చేత అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవ" ప్రతిజ్ఞను చేయించారు. అంతేకాక అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం పై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులు విద్యార్థులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.




# అనాథ బాలికలకు సువర్ణావకాశం

## ప్రవేశ పరీక్ష లేకుండానే పాలిటెక్నిక్ డిప్లొమాలో అడ్మిషన్లు

అక్షరకలం నల్లగొండ

అనాథలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురైన వారు, అక్రమ రవాణా బాధితులైన బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించింది. హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల నందు 2026-2027 విద్యా సంవత్సరానికి గాను, ఎటువంటి ప్రవేశ పరీక్ష, లేకుండా నేరుగా డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ శ్రీ బి. చంద్రశేఖర్, ఒక ప్రకటనలో తెలిపారు.
?ఈ పథకం కింద
?డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్,
?డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్,
?డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్,
?డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్,
?డిప్లొమా ఇన్ సెమీ కండక్టర్ టెక్నాలజీ,
?డిప్లొమా ఇన్ ల్యాండ్ స్కేప్ డిజైన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో (2025-26) 10వ తరగతి పూర్తి చేసిన ఆసక్తి గల బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలతో జతచేసి 25 మే 2026 లోపు నల్లగొండలోని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

అనాథ బాలికలు అయితే తల్లిదండ్రుల డెత్ సర్టిఫికేట్, సంబంధిత హోమ్ లేదా హాస్టల్ అధికారుల నుండి పొందిన పత్రం. టీసీ, స్టడీ సర్టిఫికేట్, ఎస్ఎస్‌సి మార్క్స్ మెమో తో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు.ఐతే అనాథ బాలికలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల అవసరం లేదు.
?మరింత సమాచారం కోసం:
బాల రక్షా భవన్, 6-01-102, రెండో అంతస్తు, స్వర్ణ ప్యాలెస్ పక్కన, విద్యానగర్ కాలనీ, నల్లగొండ. ఫోన్ నంబర్ 08682-293929 ను సంప్రదించాలని తెలిపారు.

# స్వయం ఉపాధి అవకాశాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

## జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి టీ. నాగిరెడ్డి






అక్షరకలం

మహిళలు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన, శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి టీ నాగిరెడ్డి సూచించారు. భువనగిరి జిల్లా కేంద్రంలో సేర్ఫ్ ( సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ ) సహకారంతో ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉదిత టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ లో ఏంపవరింగ్ రూరల్ స్వయం సహాయక సంఘాల మహిళలకు గార్మెంట్ కటింగ్, స్కిల్స్ ఫర్ స్కూల్ యూనిఫార్మ్స్ పై శిక్షణ పొందిన మహిళలకు ధృవ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టీ. నాగిరెడ్డి మాట్లాడుతూ భువనగిరిలోని ఉదిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి, వలిగొండ, బీబీనగర్, యాదగిరిగుట్ట, రామన్నపేట, మూట కొండూరు, తుర్కపల్లి, బొమ్మలరామారం, మరియు రాజపేట మండలాలకు చెందిన సుమారు 200 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడం, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు సహకరించడం హర్షనీయమని ఆయన అన్నారు. కుట్టు శిక్షణ పొంది, ప్రతిభ గల మహిళలకు వచ్చే నెలలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల/ కళాశాల , వసతిగృహాల, విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) తయారు చేయుటకు అవకాశం కల్పిస్తామని అన్నారు . ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ తో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ కే. జంగారెడ్డి ,ప్రోగ్రాం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రమణ , భువనగిరి ఏపీఎం మల్లేష్ , ఉదిత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు పాశం.అలివేలు జనార్ధన్, మోత్కూర్ ట్రైనింగ్ సెంటర్ అధికారి లక్ష్మీనారాయణ, ట్రైనింగ్ టీచర్స్ పబ్బల. విజయ, గీత పాల్గొన్నారు.

# లక్ష్యం 'సివిల్స్'.. అండగా మేముంటాం

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ భరోసా
## మైనారిటీ గురుకులంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
## వసతులపై ఆరా, అధికారులకు కీలక ఆదేశాలు
## విద్యార్థినులతో కలెక్టర్ ముఖాముఖి
## ప్రతిభావంతులకు బహుమతుల ప్రదానం

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం








నల్గొండ పట్టణం రాంనగర్‌లోని పాత మోనా కాలేజీ ప్రాంగణంలో ఉన్న మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకస్మికంగా సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లాలో సంక్షేమ వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ పాఠశాలలో జరుగుతున్న రోజువారీ కార్యక్రమాలు, విద్యార్థినులకు అందుతున్న వసతులను స్వయంగా పరిశీలించారు. పాఠశాల భవనం అంతటా పరిశీలించిన కలెక్టర్, కొన్ని చిన్నపాటి మరమ్మతుల అవసరాన్ని గుర్తించి, వాటిని వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, వంటగది లో కూరగాయలను పరిశీలించారు. కిచెన్ చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు . వేసవి సెలవుల సందర్భంగా రెసిడెన్షియల్ పాఠశాల మూసే సమయంలో ఎక్స్పైరి డేట్ అయిపోయిన వంట సరుకులు తీసేయాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం లోపు మైనర్, మేజర్ రిపేర్ల ను చేయించుకోవాలని చెప్పారు అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. సివిల్ సర్వీసెస్ సాధించాలనే ఆశయంతో ఉన్న విద్యార్థినులను ప్రోత్సహిస్తూ, వారికి అవసరమైన స్టడీ మెటీరియల్, పుస్తకాలను జిల్లా యంత్రాంగం తరఫున అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినులు తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ చెప్పారు. సంక్షేమ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి, మైనారిటీ రెసిడెన్షియల్ ఆర్‌సిఓ శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ షాహీన్ షేక్, ఉపాధ్యాయులు పాల్గొనారు.

# నేటితో ముగియనున్న శ్రీ హనుమాన్ కాశీ విశ్వేశ్వర స్వామి ఉత్సవాలు

## స్వామి వారి ఆశీస్సులు స్వీకరించిన భువనగిరి ఎమ్మెల్యే

అక్షర కలం బీబీనగర్



బీబీనగర్ మండలం జైన పల్లి గ్రామంలోని శ్రీ హనుమాన్ కాశీ విశ్వేశ్వర స్వామి ఉత్సవాలు ఈనెల 20 న ప్రారంభమై, ఈనెల 23 (గురువారం) ముగియనున్నాయి. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆలయాన్ని దర్శించుకొని స్వామి వారి ఆశీస్సులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, పొట్టోల్ల శ్యాం గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సత్తిరెడ్డి , పీఏసిఎస్ మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి , బీబీనగర్ సర్పంచి పంజాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు గడ్డం బాల్ రెడ్డి, గడ్డం బాలకృష్ణ, తంతరపల్లి అంజనేయులు గౌడ్ , బద్దం వసుదేవ్ రెడ్డి , గణేష్ ముదిరాజ్ , బాలపోచయ్య , చంద్రమౌలి గౌడ్, అమరేందర్ రెడ్డి , మధు గౌడ్ , సహదేవ , గణేశ గౌడ్ ,జగదీశ్ ,హరీశ్ ,మహేష్ , హరిబాబు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెరుగు మధుకు ఘన సన్మానం

యాదాద్రి భువనగిరి అక్షరకలం


భువనగిరి పట్టణానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు మెరుగు మధు ఇటీవల కేంద్ర ప్రభుత్వం తరపున "సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికెట్" హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ సలహా మండలి సభ్యులుగా నియమితులైనారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్ లో "బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ " ఆధ్వర్యంలో మెరుగు మధు ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పగిడాల జలేంధర్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా అద్యక్షులు మిర్యాల దుర్గా ప్రసాద్, జిల్లా కోశాధికారి ఎస్. ప్రభాకర్ రెడ్డి, తోటకూర యాదయ్య, చంద్రశేఖర్, కీర్తి పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

అక్షరకలం దేవరకొండ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా తాటికోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో బుధవారం ముందస్తు 'బడి బాట' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ జె. బక్కయ్య నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం తాటికోల్ పరిధిలోని చింతబావి మరియు మంగలోని బావి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యావశ్యకతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు మెరుగైన వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, పౌష్టికాహారం అందుబాటులో ఉన్నాయని గ్రామస్థులకు వివరించారు. బడి ఈడు పిల్లలు ఎవరూ కూడా బడికి వెళ్లకుండా ఇంట్లో ఉండకూడదని, ప్రతి ఒక్కరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో చింతబావి ఎంపీపీఎస్ ప్రధాన ఉపాధ్యాయురాలు సమ్రీన్, మంగలోని బావి ఎంపీపీఎస్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్, తాటికోల్ జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ జె. బక్కయ్యతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# అకాల వర్షంతో నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్

**అక్షరకలం దేవరకొండ**

అకాల వర్షాల వల్ల వరి పంట నష్టపోయి కోలుకోలేని స్థితిలో ఉన్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కొండమల్లెపల్లి మండలం చెన్నారం గ్రామంలో వర్షానికి తడిసి ముద్దయిన, నేలకొరిగిన వరి పంటను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఆకాశమే హద్దుగా కష్టపడి పండించిన



పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం రైతు నోటికాడి బువ్వను దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అకాల వర్షాలు కురిసినప్పుడు రైతులకు అండగా నిలిచి తక్షణ సహాయం అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రైతులు అధైర్యపడొద్దని, బిఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా రైతులకు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే పంట నష్టం అంచనా వేసి, బాధితులకు పరిహారం అందేలా చూడాలని పట్టుబట్టారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీసీ సంక్షేమ సంఘం మద్దతు



**అక్షరకలం దేవరకొండ**

తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం దేవరకొండలో సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బుధవారం నిర్వహించిన నిరసనలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2021-2025 వేతన సవరణ అమలు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ తక్షణమే చెల్లించకపోతే కార్మికులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, డాక్టర్ భాషా చౌహాన్, పున్న వెంకటేష్ నేత, ఆర్టీసీ జెఏసి చైర్మన్ ఇరగదండ్ల శీను, వైస్ చైర్మన్ ఓరుగంటి రమేష్ గౌడ్, కోశాధికారి నరహరి తదితరులు పాల్గొన్నారు.

## డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల బైఠాయింపు





**అక్షరకలం కోదాడ**

రాష్ట్రవ్యాప్త ఆర్టీసీ జేఏసీ పిలుపులో భాగంగా కోదాడ డిపో ఎదుట డ్రైవర్లు, కండక్టర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. బుధవారం ఉదయం డిపో గేటు వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, కార్మికుల పొట్ట కొట్టవద్దని డిమాండ్ చేశారు. పోలీసులు చేరుకుని ఆందోళనకారులను అడ్డుకున్నారు. డిపో ఎదుట ధర్నా చేయడం వల్ల రాకపోకలకు ఆటంకం కలుగుతుందని, తక్షణమే అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సిబ్బందికి స్పష్టం చేయడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. డిపో వద్ద నిరసన తెలపడానికి అనుమతి లేదని, తక్షణమే ఖాళీ చేయాలని హెచ్చరించారు. బస్సులు డిపోకే పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## జిఎం హామీతో సెక్యూరిటీ గార్డుల పోరాటానికి తాత్కాలిక విరామం




**మందమర్రి, ఏప్రిల్ 22 అక్షర కలం:**

ఏరియాలో విధులు నిర్వహిస్తున్న 220 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు విధులు కల్పించాలని డిమాండ్ చేస్తూ, గత 16 రోజులుగా చేస్తున్న పోరాటానికి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ హామీతో తాత్కాలికంగా విరామం ఇస్తున్నామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సంకె రవి లు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సింగరేణి ఎస్ అండ్ పిసి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని, కొత్త టెండర్ పిలిచి, ఎలాంటి షరతులు లేకుండా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులందరికీ యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో గత 16 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన, ఆందోళన, పోరాటాలు నిర్వహించగా, ఈ పోరాటంలో భాగంగా ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ, నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ లకు సైతం సెక్యూరిటీ గార్డుల సమస్యలు విన్నవించుకోవడం జరిగిందన్నారు.

## మున్సిపల్ చైర్మన్ వర్సెస్ ఎమ్మెల్యే

### సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియో

### క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కౌన్సిలర్ల డిమాండ్




**అక్షరకలం యాదాద్రి భువనగిరి**

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్ తంగెళ్ళపల్లి శ్రీవాణి పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని భువనగిరి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే పై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తో భేటీ అయిన భువనగిరి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, అవసరమైతే మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఎమ్మెల్యే ను కోరినట్లు సమాచారం. స్వంత పార్టీలో అసమ్మతి సెగలు పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే అంశంగా భావించిన సీనియర్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది. డీ లిమిటేషన్ జరిగితే ప్రస్తుతం భువనగిరి ఎమ్మెల్యే గా ఉన్న కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నూతనంగా ఏర్పడే చౌటుప్పల్ శాసనసభ నియోజకవర్గం కు వెళతాడని, దాంతో ఎమ్మెల్యే తో ఉన్న తలకాయ నొప్పి తగ్గుతుందని మున్సిపల్ చైర్మన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి ఫోన్ లో కాంగ్రెస్ కార్యకర్త తోమాట్లాడినట్లు సోషల్ మీడియా లో ఆడియో వైరల్ అవుతుంది. ఎమ్మెల్యే మాత్రం వదిలేయండి అని అన్నట్లు తెలుస్తోంది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ చైర్మన్ భీమా నాయక్



**వలిగొండ అక్షర కలం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఎం తుర్కపల్లి,నర్సాపురం, దుపెల్లి, వేములకొండ, నర్సాయిగూడెం, లోతుకుంట,బుర్లగడ్డ, వర్కట్ పల్లి, టేకుల సోమవారం,రెడ్ల రేపాక, గ్రామాలలో ఐకెపి సెంటర్లు ప్రారంభించిన మార్కెట్ చైర్మన్ భీమా నాయక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలనలో రైతులకు పెద్దపీట వేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా ముందుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డ్ మెంబర్లు, ఏపిఎం అంజయ్య, సి సి లు అశోక్ రవీందర్, బాబు ఆయా గ్రామాల మహిళా సంఘం అధ్యక్షురాళ్ళు బట్టు పావని, జానమ్మ, మానస, దేవేంద్ర, వేల్పుల కొమురెల్లి కావటి అక్షిత, కల్లూరి రమేష్ రాపోలు దేవ రాణి, సత్తమ్మ, రాములమ్మ, సునీత, ఎర్ర వసంత, నవనీత, రవళి, బిక్షమమ్మ, గంధ మల్ల వసుమతి ఉప్పలమ్మ, మాడుగుల నిర్మల, భాను రేఖ, షీలా రేణుక,కల్యారి మౌనిక, రమాదేవి ఉమా, చేకూరి మల్లమ్మ లక్ష్మమ్మ ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గీతా విద్యాలయంలో ఘనంగా 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### డిప్యూటీ రేంజ్ అధికారి మీసాల రాములు




**అక్షరకలం, చండూరు**

చండూరు మున్సిపల్ పరిధిలోని గీతా విద్యాలయం ఉన్నత పాఠశాలలో బుధవారం నాడు మునుగోడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ ఆధ్వర్యంలో "ప్రపంచ ధరిత్రి దినోత్సవం" వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాంపల్లి డిప్యూటీ రేంజ్ అధికారి మీసాల రాములు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్య కోరల నుండి భూగోళాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నొక్కి చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పోలోజు నర్సింహచారి మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుండే ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణ పరిరక్షణను ఒక అలవాటుగా మార్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీ బీట్ అధికారులు ప్రవీణ్, ఉదయ్, లావణ్యలతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ కావటి మంజుల



**వలిగొండ అక్షర కలం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నర్సాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మార్కెట్ చైర్మన్ భీమా నాయక్,సర్పంచ్ కావటి మంజుల ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంటపల్లి మహేష్, వార్డ్ మెంబర్స్ వేల్పుల కలమ్మ ,బుంగపట్ల నరహరి, వేర్పుల కొమురెల్లి ,కావటి అక్షిత,కల్లూరి రమేష్,వేల్పుల యాద మల్లయ్య పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**మిర్యాలగూడ అక్షర కలం**



మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. మిర్యాలగూడ లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల పట్ల నిర్లక్ష్యం చేసే కఠిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు,ముందుగా ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించి పేషంట్ లతో ఎమ్మెల్యే మాట్లాడారు. వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. అందరికీ చికిత్స, మందుల పంపిణీ, ఆహారం విషయంపై ఆరా తీశారు. అదేవిధంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమయపాలన కూడా ఆయన ఎమ్మెల్యే బిఎల్ఆర్ బ్రదర్స్ తనిఖీ చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ప్రభుత్వం బాధ్యత వహించాలి

## చర్చల ద్వారానే సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### నల్లగొండ బస్ డిపో వద్ద సమ్మెకు మద్దతు తెలిపిన సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

అక్షరకలం నల్గొండ

టీఎస్ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్టీసీ కార్మికుల సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. నల్లగొండ బస్ డిపో వద్ద సమ్మెకు మద్దతు తెలుపుతూ కార్మికులను ఉద్దేశించి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి అందించాలని తెలిపారు. ఆర్టీసీ స్థలాలను ఈవీ బస్సుల కోసం ఇవ్వరాదని స్పష్టం చేశారు. అద్దె బస్సులను, అద్దె బస్సుల డ్రైవర్లను ఆర్టీసీలో విలీనం చేసి గతంలో మాదిరిగా జాతీయం చేయాలని కోరారు.





ఆర్టీసీ రక్షణ కోసం, కార్మికుల సమస్యల సాధన కోసం చేపట్టిన ఈ సమ్మెను ప్రభుత్వం జటిలం కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయడంతో పాటు 2025 వేతన సవరణను కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ప్రతినెల రూ.400 కోట్లు ఆర్టీసీకి విడుదల చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి బెడ్ విన్నర్ పోస్టులను శాశ్వత ఉద్యోగాల కింద భర్తీ చేయాలని అన్నారు. ట్రేడ్ యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారాలు తగ్గించి కండక్టర్లు, డ్రైవర్లపై కెఎంపిఎల్, ఈ పి కె వేధింపులు నిలిపివేయాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ సిబ్బందిపై బలవంతపు బదిలీ ఉత్తర్వులను రద్దు చేయాలని, 2019 సమ్మె సమయంలో నమోదైన పోలీసు కేసులను ఎత్తివేయాలని అన్నారు. మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచి అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేయాలని, రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల ఐక్యతతో ఈ సమ్మె జయప్రదం కావాలని, సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని నెల్లికంటి సత్యం స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి, ఆర్ టి సి రాష్ట్ర జేఏసీ నాయ కులు బి. నరేందర్, యార చంద్రయ్య, జిల్లా నాయకులు ఎన్ ఆర్ సి రాజు,టిజె రావు,డిపో నాయకులు ఏ ఎల్ స్వామి, బి. శంకరమ్మ,వి లెనిన్, ఎం. నందం, మదర్, విరయ్య, యూసుఫ్,ఆర్ ఎస్. రాములు, సలాం,శ్రీను కార్మికులు తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఎం మద్దతు



అక్షరకలం నల్గొండ

ఆర్టీసీ కార్మికులకు ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సీపీఎం మద్దతిస్తుందని ఆ పార్టీ నల్లగొండ పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య తెలిపారు. బుధవారం సుందరయ్య భవన్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు యాజమాన్యానికి వివిధ సంఘాల ఆధ్వర్యంలో వారి కోరికలు అనేక రూపంలో వినతిపత్రాలు ఇచ్చి నిరసన తెలియజేశారని, వారి కోరికలు సమంజసమని ఆయన అన్నారు. కార్మికుల కోరుతున్న మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీ నేపథ్యంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని ఎలక్ట్రికల్ బస్సులను ప్రైవేటు వారికి కాకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతున్న డిమాండ్ల న్యాయమైనవి అని వారు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ కార్మికులకు 2017 నుండి చెల్లించాల్సిన ఏరియర్స్ చెల్లించాలని పిఆర్సి ని అమలు చేయాలని వారు కోరారు. ఆర్టీసీలో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం జరగాలన్నారు. గతంలో కెసిఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్మికులు కోరేది గొంతెమ్మ కోరికలు కావని వారికి కావాల్సిన కనీస సౌకర్యాలని అడుగుతున్నారని వీటిని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రజాస్వామ్యంలో యూనియన్ లు పెట్టుకొని హక్కు అందరికి ఉన్నదని ఆర్టీసీలో యూనియన్లు అనుమతించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, అవుట రవీందర్, దండెంపల్లి సరోజ, అద్దంకి నర్సింహ, ఊట్కూర్ మదూసుధన్ రెడ్డి,గంజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అక్షర కలం బీబీనగర్

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన టంటం ఎల్లయ్య కుమార్తె ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాయకులు పొట్టోల శ్యామ్ గౌడ్ మరియు సర్పంచ్ సిద్ధగోని శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహప్రవేశం చేసిన దంపతులకు నూతన వస్త్రాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. స్వంత ఇంటి కల కల నెరవేర్చిన భువనగిరి ఎమ్మెల్యే కుంబం అనిల్ కుమార్ రెడ్డి కి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్టోల శ్యామ్ గౌడ్ , గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సిలివేరు కవిత మహేష్ , వార్డ్ సభ్యులు తొర్పునూరి రవి గౌడ్, న్యాలపట్ల అజయ్ గౌడ్ , కొమ్ము మంగమ్మ, కాంగ్రెస్ పార్టీ గ్రామ





శాఖ అధ్యక్షులు మేకల కుమారస్వామి ,అంబటి చంద్రయ్య , బండారి వెంకటేష్ గౌడ్, రక్తని మల్లేష్, సిద్దగోని యాదగిరి , టంటం యాదగిరి, మేకల మల్లేష్ , బుయ్య బసవయ్య ,బుయ్య సంతోష్ గౌడ్ , గోలనకొండ ప్రసాద్, అంబటి కృష్ణ పాల్గొన్నారు

# విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి.



గద్వాల అక్షర కలం

విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకంగా ఆలోచిస్తే నూతన ఆవిష్కరణలు చేయవచ్చని, సాహితీ రంగంలోనూ రాణించవచ్చని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని కస్తూర్బా విద్యాలయాల విద్యార్థులకు క్విజ్, స్టోరీ టెల్లింగ్, చిత్రలేఖనం, నృత్య, నాటక, తదితర పోటీలు నిర్వహించగా విజేతలుగా నిలిచిన వారికి బుధవారం గద్వాల బాలభవన్ లో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్య పుస్తకాలతో పాటు తీరిక ఉన్నప్పుడు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదవాలన్నారు. ముఖ్యంగా ప్రతినిత్యం కొంత సమయాన్ని పత్రికలను చదివేందుకు కేటాయిస్తే విద్యార్థులకు కరెంట్ అఫైర్స్ పై పట్టు వస్తుందన్నారు. దాంతోపాటు క్విజ్ పోటీల్లో అడిగే ప్రశ్నలకు సులువుగా సమాధానాలు చెప్పి విజేతలుగా నిలిచేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే వేసవి సెలవుల్లో గొప్ప రచయితలు రాసిన మంచి పుస్తకాలను చదివి సాహిత్య అభిలాషను పెంపొందించుకోవాలని సూచించారు. స్టోరీ టెల్లింగ్ వంటి పోటీల్లో ప్రతిభ చాటేందుకు సాహిత్యం పై ఆసక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే భవిష్యత్తులో విద్యార్థులు కూడా సాహితీవేత్తలుగా కవిత, కథ, నవల, వ్యాస, నాటక, తదితర ప్రక్రియల్లో రచనలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా వారం పాటు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, రెసిడెన్షియల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ వంతుగా విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అదనపు కలెక్టర్, ఇతర అధికారులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఈఓ విజయలక్ష్మి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, డిడబ్ల్యుఓ సునంద, డీవైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, కేజీబీవీ కోఆర్డినేటర్ జ్యోతి, ఇతర అధికారుల పాల్గొన్నారు.

# బీసీ కులాలు ఐక్యత వర్ధిల్లాలి ;

### – నారాయణపేట జిల్లా బీసీ కులాల సంగం నాయకులు వెంకట్ రాములు......

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,22)

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీ కులాలు ఐక్యమత్తంగా ఉండాలని నారాయణపేట జిల్లా బీసీ కులాల సంఘం నాయకులు వెంకట్ రాములు అన్నారు. బుధవారం నాదు పేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో శివాలయంలో మరికల్ మండల స్థాయి బీసీ కులాల సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో తమ తమ సత్తాను చాటాలన్నారు. బీసీలు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అనంతరం వివిధ గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శాలువలతో పూలమాలతో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు కానుగంటి నారాయణ, మురళి యాదవ్, వెంకట్ రాములు ,బాలకృష్ణ గౌడ్, నరేందర్ గౌడ్, కే. కృష్ణయ్య, గొల్ల కృష్ణయ్య, నర్మద రవికుమార్ గౌడ్, కటికే కాజా, రాష్ట్ర అధ్యక్షులు పాండుయాదవ్, మాజీ సర్పంచ్ గోవర్ధన్, పసుపుల తిమ్మప్ప గౌడ్, రవికుమార్ గౌడ్, చంద్రయ్య, నరసింహ,తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేయాలి

### ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి



యాదాద్రి భువనగిరి అక్షర కలం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ను ప్రభుత్వం లో విలీనం చేసి, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ కార్మికులు యాదగిరిగుట్ట డిపో ఎదుట చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయ బద్ధమైన డిమాండ్లైన కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు, పెండింగ్ పే స్కేలు, పీ ఆర్ సీ బకాయిలు విడుదల, ప్రైవేటు బస్సుల రద్దు, అపాయింట్మెంట్ తేదీ ప్రకటన , యూనియన్లు పునరుద్ధరణ తదితర డిమాండ్ లను పరిష్కారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు గోద శ్రీరాములు, ఎం డి ఇమ్రాన్, కళ్ళెం కృష్ణ, ఫేరభోయిన మహేందర్, కొల్లూరు రాజయ్య, గోరేటి రాములు, కల్లేపల్లి మహేందర్, సామల భాస్కర్, ఆర్టీసీ జేఏసీ నాయకులు మంగ ప్రవీణ్ రెడ్డి, వెంకన్న, ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు

యాదాద్రి భువనగిరి అక్షర కలం

మొదటి దఫా ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి పై ఇంజనీర్ల తో సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కళ నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే స్లాబ్ లెవెల్ పూర్తి అయిన ఇండ్లకు గృహప్రవేశాలు చేయుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పి డి శ్రీరాములు, డీఈ, ఏఈ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 1వ దన్నేస్ ఇంటర్ నేషనల్ ఫైడ్ రేటెడ్ 2026 ఓపెన్ చెస్ టోర్నమెంట్ బ్రోచర్ ను ఆవిష్కరించిన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి :



హైదరాబాద్ : ఏప్రిల్ 22,

( అక్షర కలం స్పోర్ట్స్ న్యూస్ ):
దన్నేస్ చెస్ అకాడమీ టోర్నమెంట్ డైరెక్టర్ ఎ. రాజ్యలక్ష్మి రామ్ సారధ్యంలో ఏప్రిల్ 30 నుండి మే నెల 4వ తేది వరకు నిర్వహించబోతున్న 1వ దన్నేష్ ఇంటర్ నేషనల్ ఫైడ్ రేటెడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ 2026 కి గాను సంబందించిన చెస్ క్రీడా బ్రోచర్ ను తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం మినిస్టర్ కార్యాలయం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, క్రీడలను అభివృద్ధి పరచే క్రీడా అకాడమీ లకు రాష్ట ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. అనంతరం దన్నేస్ చెస్ అకాడమీ టోర్నమెంట్ డైరెక్టర్ ఎ. రాజ్యలక్ష్మి రామ్ మీడియా తో మాట్లాడుతూ, ఈ ఇంటర్ నేషనల్ టోర్నమెంట్ ను సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్ లో పాల్గొనే చెస్ క్రీడాకారులు మరిన్నీ వివరాలు తెలుసుకోవడానికి 6302022812 నెంబర్ కు సంప్రదించవచ్చని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం లో దన్నే నవీణ్ రామ్, ఎమ్, అనిత, ఎమ్ అమృత, షేక్ గౌసియా తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

**కొండాపూర్ మండలం తేర్పోల్, ఎదురుగుడెం గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాలకు భూమి పూజ చేసిన నిర్మలా జగ్గారెడ్డి**



సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తుందని టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిదిలోని తేర్పోల్, ఎదురుగూడెం గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ రూ 10 లక్షల తో నిర్మంచే మహిళా సమాఖ్య భవనాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్మల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల పక్షపాతి అని, మహిళల కోసం ప్రత్యేకంగా సఃఓఏమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రతి మహళను కోటీశ్వరురాలిని చేసేందుకు డ్వాక్రా సంఘాల ద్వారా పావల వడ్డీకే రుణాలను అందించడం జరిగిందన్నారు. రాష్ట్రవలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఇవే కాకుండా మహిళా సంఘాల సభ్యులకు ఇందరిమ్మ చీరలు, మహిళల పేరుపైన నూతన రేషన్ కార్డులు, ప్రస్తుతం ఇళ్ళు లేని వారికి మహిళల పేరుమీదనే ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించుకునేందుకు ప్రభుత్వం విడతల వారీగా రూ 5 లక్షల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. గత పాలకుల మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదన్నారు. గత 10 సంవత్సరాల గ్రామంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సర్పంచ్ సతీష్, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశం గౌడ్. నర్సింలు, ప్రభుదాసు, అశోక్, గోపాల్ తో పాటు పంచాయతీ సభ్యులు, ఐకెపి వీఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో 1738 ఎకరాల్లో పంట నష్టం.

గద్వాల అక్షర కలం

జోగులాంబ గద్వాల జిల్లాలోని ఐజ, రాజోలి మండలాల్లో రైతులు సాగు చేసిన వరి పంట మంగళవారం కురిసిన వర్షానికి 1738 ఎకరాలు దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మంగళవారం వడగండ్లతో కూడిన అకాల వర్షం కురవడంతో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ఐజ, రాజోలి మండలాల్లోని మాన్ ధొడ్డి, నసనూరు, పచ్చర్ల, చిన్న తాంద్రపాడు, ఉప్పల్, చిన్న ధన్వాడ తదితర గ్రామాలలో యాసంగి 2025-26 లో సాగు చేసిన వరి పంట మొత్తం విస్తీర్ణం లో 1738.34 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. 80% పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపటం



జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప మాన్ దొడ్డి గ్రామంలో రైతులు నష్టపోయిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఏడీఏ సక్రియ నాయక్, రాజోలి మండల వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, ఏఈఓ శ్వేత, తదితరులున్నారు.

# జనగణన కార్యక్రమం జాగ్రత్తగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22:

జనగణన -2027 కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో



ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఇండ్ల గణనపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి మండల తహశీల్దార్ మల్లికార్జున్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జనగణన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం



చేపట్టాలని, జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్ వివరాలను అందించడం జరుగుతుందని తెలిపారు. మే 11వ తేదీ నుండి నిర్వహించనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. రోజురోజుకు ఉష్ణోగ్రత తీవ్రమవుతున్న దృష్ట్యా ఉదయం వేళలో ప్రక్రియ నిర్వహించేలా కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. తమ జాబితాలోని ఇండ్ల గణన కొరకు ముందుగా ఆయా ఇండ్ల యజమానులకు సమాచారం అందించినట్లయితే సమయానికి అందుబాటులో ఉంటారని, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమయపాలన పాటించాలని, ఇండ్ల గణన కొరకు నియమించబడిన అధికారులు ఎన్నికల విధులు నిర్వహించారని, అనుభవంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు అందిస్తున్న శిక్షణలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రక్రియ నిర్వహించే సమయంలో తలెత్తే సందేహాల నివృత్తి కొరకు గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణకు హాజరు కాని వారు తరువాత ఏర్పాటు చేసే శిక్షణ కార్యక్రమానికి హాజరై ఇండ్ల గణన ప్రక్రియపై అవగాహన పొందాలని తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, ఎన్నికల నిర్వహణ జనగణన పై ఆధారపడి ఉంటుందని, ఈ నేపథ్యంలో ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అంతకుముందు మండలంలోని కిష్టంపేటలో గల డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెన్నూరు పట్టణంలో చేపట్టిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణ పనులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులలో భాగంగా ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలించి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం, భోజనశాల, వంటశాల లను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎంపిఎస్ఓ ప్రవీణ్ కుమార్, ఫీల్డ్ ట్రైనర్లు సురేందర్, గోపికృష్ణ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల ఆహ్వానం

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,22)

నారాయణ పేట జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన బాల బాలికల నుండి 2026 – 27 విద్యా సం. నకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం క్రింద 3వ, 5వ, 8వ తరగతులలో ప్రవేశముల కొరకు గిరిజన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కో రబడుచన్నవి. జిల్లాలో ఈ పథకము క్రింద మొత్తము (15) సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు తేది. 07.05.2026లోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం, రూము నంబర్.123, మొదటి అంతస్తు, జిల్లా కలెక్టర్ కార్యాలయముల సముదాయము, పాలకొండ, మహబూబ్ నగర్ నందు పూర్తిచేసిన దరఖాస్తులను సమర్పించవలయునని మరియు తేది 22.04.2026 నుండి దరఖాస్తు లను ఉచితముగా పొందవచ్చునని యం. ఛత్రు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, నారాయణ పేట జిల్లా గారు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో వచ్చిన దరఖాస్తులను తేది.14.05.2026 నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం, నారాయణ పేట లో లాటరీ పద్ధతి ద్వారా (15) గురుని ఎంపిక చేయబడునని దరఖాస్తు చేసుకొను బాలబాలికల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1,50,000 గ్రామీణ ప్రాంతం మరియు 2,00,000 పట్టణ ప్రాంతం వారికి ఉండవలెను. కుల, నివాస, ఆదాయ, ధృవీకరణ పత్రములు తహసీల్దార్ / మీ సేవ ద్వారా పొందిన వాటిని జిరాక్సు ప్రతులను (2 )పాస్ పోర్ట్ ఫోటోస్ మరియు ఆధార్ కార్డులను దరఖాస్తునకు జతపరచి సమర్పించి వలయునని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# జిల్లాలోని గ్రామీణ ప్రాంతములలో వేసవి క్రీడా శిక్షణా తరగతుల దరఖాస్తుల కు ఆహ్వానం;

(అక్షర కలం, నారాయణపేట జిల్లా, రిపోర్టర్, ఏప్రిల్,22)

జిల్లాలోని గ్రామీణ ప్రాంతములలో వేసవి క్రీడా శిక్షణా శిభిరాలను నిర్వహించుటకు వ్యాయామెపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు డి వై ఎస్ ఓ వెంకటేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారము ,రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ( శాట్స్), జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణా ప్రాంతములో ఈ నెల 24నుండి జూన్ 7వరకు వేసవిలో నిర్వహించే ( వివిధ క్రీడాంశాలకు ) క్రీడాశిక్షణా శిభిరాలు నిర్వహించదలచిన వ్యాయామెపాధ్యాయులు ( పి.డి లేదా పి.ఇ.టి) లేక సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులు కోరడమైనది. సీనియర్ క్రీడాకారులైతే కనీసం జాతీయ స్థాయి పోటీలలో పాల్గోని ఉండాలి. తమ దరఖాస్తుతో పాటు సంబంధిత క్రీడలలో తాము సాధించిన దృవపత్రములను (సర్టిఫికెట్స్) జతపరుచవలెను. స్థానికంగా ఉండి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించగలిగే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోనవలెను. దరఖాస్తును జిల్లా యువజన మరియు క్రీడాల కార్యాలయము మినీ స్టేడియం నారాయణపేట జిల్లా నందు వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా 23-04-2026 తేదీలోగా అందేలా పంపవలయును . గ్రామీణ మరియు కొత్త సెంటర్లకు ప్రాముఖ్యత ఇవ్వబడుననీ తెలిపారు.

# గ్రామీణ ప్రాంతములలో వేసవి క్రీడా శిక్షణా శిబిరం చేయండి;

(అక్షర కలం, నారాయణపేట జిల్లా, రిపోర్టర్, ఏప్రిల్,22)

జిల్లాలోని గ్రామీణ ప్రాంతములలో వేసవి క్రీడా శిక్షణా శిభిరాలను నిర్వహించుటకు వ్యాయామెపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు డి వై ఎస్ ఓ వెంకటేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారము ,రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ( శాట్స్), జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణా ప్రాంతములో ఈ నెల 24నుండి జూన్ 7వరకు వేసవిలో నిర్వహించే ( వివిధ క్రీడాంశాలకు ) క్రీడాశిక్షణా శిభిరాలు నిర్వహించదలచిన వ్యాయామెపాధ్యాయులు ( పి.డి లేదా పి.ఇ.టి) లేక సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులు కోరడమైనది. సీనియర్ క్రీడాకారులైతే కనీసం జాతీయ స్థాయి పోటీలలో పాల్గోని ఉండాలి. తమ దరఖాస్తుతో పాటు సంబంధిత క్రీడలలో తాము సాధించిన దృవపత్రములను (సర్టిఫికెట్స్) జతపరుచవలెను. స్థానికంగా ఉండి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించగలిగే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోనవలెను. దరఖాస్తును జిల్లా యువజన మరియు క్రీడాల కార్యాలయము మినీ స్టేడియం నారాయణపేట జిల్లా నందు వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా 23-04-2026 తేదీలోగా అందేలా పంపవలయును . గ్రామీణ మరియు కొత్త సెంటర్లకు ప్రాముఖ్యత ఇవ్వబడుననీ తెలిపారు.

# విద్యార్థుల ప్రతిభకు వేదికగా చదువుల పండుగ

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.**


**అట్టహాసంగా చదువుల పండగ 2.0.**

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,22)

విద్యార్థుల ప్రతిభకు చదువుల పండగ కార్యక్రమం ఒక వేదికగా నిలిచిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లాలో ఎఫ్ ఎల్ ఎన్ , ఎల్ ఐ పీ అమలులో మంచి పురోగతి సాధిస్తున్నాయని, ఈ నవకల్పనలు రాష్ట్ర విద్యాశాఖకు దిక్సూచిగా మారాలని ఆయన ఆకాంక్షించారు.నారాయణపేట జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం. జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన "చదువుల పండుగ 2.0" కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై సరస్వతీ మాత చిత్రపటానికి పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు మూడేళ్ల కృషికి ఫలితం ఈ చదువుల పండగ 2.0. కార్యక్రమం అన్నారు. తాను రంగారెడ్డి జిల్లాలో ఉన్నప్పుడు నారాయణ పేట జిల్లాలో కొనసాగే విద్యా అభివృద్ధికి చేసున్న వినూత్న కార్యక్రమాల గురించి విన్నానని, తర్వాత కలెక్టర్లు కోయ శ్రీహర్ష, సిక్తా పట్నాయక్ లు జిల్లాలో విద్యాభివృద్ధికి చేసిన కృషిని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధించగలరని ఆయన తెలిపారు. భవిషత్తు విద్యార్థులది అన్నారు. కొత్త కొత్త ఆలోచనలతో జిల్లా, రాష్ట్రం, దేశానికి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. విద్యతోనే నవ సమాజం నిర్మాణం సాధ్యమన్నారు. ఇప్పటి వరకు తాను కలెక్టర్ గా చేసిన మూడు జిల్లాల లో ఇలాంటి విద్యా కార్యక్రమాలను చూడలేదని చెప్పారు. సమయం లేక మిగతా అన్ని ప్రదర్శనలు చూడలేక పోతున్నానని, కానీ అన్నింటిని రికార్డు చేసి తనకు పంపిస్తే తప్పకుండా చూస్తానని కలెక్టర్ విద్యా శాఖ అధికారులకు సూచించారు. అంతకు ముందు కలెక్టర్ ప్రతీక్ జైన్ స్టాళ్లను సందర్శించి విద్యార్థులను అభినందించారు. ప్రతి స్టాల్‌ను పరిశీలించి, రీడింగ్, స్పెల్-బీ, క్విజ్, గణితం వంటి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యా అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని కాగా ఈ కార్యక్రమం విద్యార్థులలో అభ్యాసంపై ఆసక్తి పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడానికి ఒక సమర్థ వేదికగా నిలిచింది.మండల స్థాయి పోటీల్లో విజేతలైన 3, 4, 5, 6, 7 తరగతుల విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన తెలుగు, ఆంగ్లం, గణితం పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అదనంగా 6 మరియు 7 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో కూడా విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే మొదటిసారి వినూత్న పోటీలు

విద్యార్థులు ఎఫ్ఎల్ఎన్ ( ఎఫ్ ఎల్ ఎన్) సామర్థ్యాలకు అదనంగా ఎల్బీ (ఎల్బీ) రీడింగ్, కాంప్రహెన్షన్, రైటింగ్, మెమరీ టెక్నిక్స్, వేదిక్ మ్యాథమెటిక్స్ వంటి అంశాలపై పోటీలను నిర్వహించడం రాష్ట్రంలోనే ఇదే మొదటిసారి కావడం విశేషం.ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోస్) తమ విద్యా కార్యక్రమాలను ప్రదర్శిస్తూ ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశాయి. బోష్ ( బస్కో) సంస్థ సి ఎస్ ఆర్ సహకారంతో అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రదర్శించబడ్డాయి.స్వతః ఫౌండేషన్ వారు ఆర్థిక అవగాహన కార్యక్రమాలను, ఇంక్వి-ల్యాబ్ సంస్థ డీ మార్క్ స్పేస్ మరియు ఎయిర్టెల్ టేకింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థుల ఆవిష్కరణలను ప్రదర్శించింది.డిజిటల్ ఈక్విటీ



సంస్థ డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను, ఫ్యూచర్‌డాట్స్ సంస్థ కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలను పరిచయం చేసింది. ఆలోకిట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యంగ్ ఒరేటర్స్ క్లబ్ ( వై ఓ సి) ప్రదర్శనలో విద్యార్థులు తమ ఆంగ్ల నైపుణ్యాలను అద్భుతంగా చూపించారు. అంతకు ముందు జిల్లా విద్యా ప్రగతిపై జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎం. గోవింద రాజు మాట్లాడుతూ, ఎస్సీఈఆర్టీ రాష్ట్ర స్థాయి సర్వేలో నారాయణపేట జిల్లా ఎఫ్ ఎల్ ఎన్ పనితీరులో రాష్ట్రంలో టాప్ 5 జిల్లాల్లో స్థానం సంపాదించిందని తెలిపారు.అలాగే ప్రకాష్ / నేషనల్ అచీవ్మెంట్ సర్వేలో జిల్లాను డ్రెస్సింగ్ డిస్ట్రిక్ట్ గా గుర్తించారని వెల్లడించారు.ఉన్నత పాఠశాల స్థాయిలో అమలు చేస్తున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని, వీటిని మరింత పద్ధతిగా, పకడ్బందీగా అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కట్టుబడి ఉన్నామని డీఈఓ తెలిపారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారులు నాగార్జున, శ్రీనివాస్, సైన్స్ అధికారి భాను ప్రకాష్, తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు (ఎంఈఓ), స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సెక్టోరల్ అధికారులు, మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# చర్ల,దుమ్ముగూడెం,ప్రజల దాహార్తి తీర్చిన. ఎంపీ వద్దిరాజు.రవిచంద్ర,

అక్షర కలం / భద్రాచలం



ఏజెన్సీ ప్రాంతాలైన చర్ల దుమ్ముగూడెం మండలాల్లోని గిరిజన గూడెల్లో నీటి ఎద్దడి సమస్యకు బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరిష్కారం చూపారు.తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అక్కడి గిరిజనులకు చేతిపంపుల ద్వారా మంచినీటిని అందజేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు ఎంపీ రవిచంద్ర స్పందించి తన ఎంపీ ల్యాడ్స్ నిధులతో రెండు మండలాల్లో ఇరవై మూడు మంచినీటి బోర్లు మంజూరు చేశారు. వీటిలో దుమ్ముగూడెం లో పదిహేను చర్లలో ఎనిమిది బోర్లు ఉన్నాయి.ఈ మేరకు బోర్ల నిర్మాణానికి అయ్యే ముప్పై ఐదు లక్షల రూపాయలు విడుదల చేశారు.ఎండాకాలం తీవ్రత దృష్ట్యా సత్వరమే బోర్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. తాము అడిగిన వెంటనే బోర్లు మంజూరుతో పాటు నిధులు విడుదల చేసినందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు రావులపల్లి.రాంప్రసాద్,మానె. రామకృష్ణలు,కృతజ్ఞతలు తెలిపారు.

# గోదావరిఖనికట్ట ప్రదేశాల్లో ప్రకృతి వనం

## సబ్ కలెక్టర్. మృణాల్ శ్రేష్ట,

అక్షర కలం / భద్రాచలం

భద్రాచలంలోని గోదావరి నది ఒడ్డున ఉన్న దశాబ్దాల నాటి పురాతన చెత్త డంప్ సైటును ఐటీడీఏ పీవో బి రాహుల్ మరియు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి పనిచేసిన సమయంలో ఆయన మద్దతుతో సబ్ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ సమగ్ర గ్రీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ప్రారంభించడంతో గోదావరి కరకట్ట ప్రదేశాలలో ప్రకృతి వనంఏర్పాటుకుమార్గంసుమగమైనదని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట అన్నారు.మంగళవారం నాడు సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి గత సంవత్సరం గోదావరి గోదావరి కరకట్ట ప్రదేశాలలో చేపట్టిన కార్యక్రమాల గురించి ఆయన పూర్తిస్థాయిలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ రెండు వేల ఇరవై ఐదు మరియుఫిబ్రవరిరెండు వేల ఇరవై ఆరు మాసంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వంద కిలోల వరకు తొలగించడం జరిగిందని అలాగే అక్టోబర్ రెండు వేల ఇరవై ఐదు లో ప్రభుత్వ భూమినిస్వాధీనంచేసుకొని ఐదుఎకరాలలోపదివేలయూకలిప్టస్ మొక్కలుగ్రామపంచాయతీసహకారంతో నాటించి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవడం జరిగిందని అన్నారు. నవంబర్, డిసెంబర్ రెండు వేల ఇరవై ఐదుమాసములోదశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్తను క్లియర్ చేయడానికి భారీ యంత్రాలను మోహరించి,ఇసుక ఎక్స్ వెయిటర్ లారీలు వ్యర్థాలను గ్రామ పద్ధతిలో తొలగించడం జరిగిందని అన్నారు. క్లియర్ చేసిన భూమిని గ్రైండింగ్ చేసి ప్లాంటేషన్ కోసం సిద్ధం చేసి భద్రాచలం జిపి ద్వారా బయో రీమిడేయేషన్ ప్రయత్నంగా పదివేల యూకలిప్టస్ మొక్కలు నాటి గ్రామపంచాయతీ భద్రాచలం ద్వారా క్రమం తప్పకుండా వాటి సంరక్షణ బాధ్యతను తీసుకున్నారని అన్నారు.గోదావరి ఒడ్డున ఉన్న గ్రీన్ జోన్ క్లైమ్ చేసిన వ్యర్థాల డంపింగ్ యార్డ్ నుండి కనిపించే రూపాంతరం రాబోయే రెండు మూడు సంవత్సరాలలో గోదావరి నది తీర ప్రాంతం యొక్క పర్యావరణ ఆరోగ్యాన్నిగణనీయంగాపెంచుతుందనిప్రాంతాన్నిమరింతశుభ్రపరచడంమరియుపునర్ధరించడంలో మంచి పురోగతి సాధిస్తుందని అన్నారు.దీని ప్రభావం వలన దశాబ్దాల నాటి చెత్త డంపింగ్ స్థలం గోదావరి పొడవున మంచి గ్రీన్ జోన్ గా రూపాంతరం చెంది పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరిస్తుందని దీంతో ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజానీకానికిఆరోగ్యంమెరుగుపడుతుందని అన్నారు.సారపాక భద్రాచలం వంతెన జాతీయ రహదారి అధికారులతో నిరంతర సమన్వయం ఫలితంగా రెండు వేల ఇరవై ఆరు మార్చ్ లో సారపాక భద్రాచలం వంతెన పై వీధిలైట్లు ఏర్పాటు చేయబడ్డాయని దీర్ఘకాలంగాఉన్నప్రజాభద్రతసమస్యనుపరిష్కరించడం జరిగిందని అన్నారు సి ఎస్ ఆర్ కార్యకలాపాల కింద ఐటీసీతో సమన్వయం చేసుకొని వంతెనకు రెండు వైపుల నుండి అప్రోచ్ రోడ్ల మధ్యస్థం పొడవునా పూల పెంపకం మరియు గ్రీన్ కవర్ పెంపుదల చేపట్టిందని,మార్చి రెండువేలఇరవైఆరులోపూర్తయిందని,దీని ఫలితంగాసౌందర్యంమరియు ఆకుపచ్చ కవర్ గనియంగామెరుగుపడిందనిఅన్నా రు. బ్రిడ్జి ఇకె ఇల్యూమీనేషన్ ద్వారా మెరుగైన రహదారి భద్రత,కీలకమైన ధమనుల రోడ్లవెంటసౌందర్యంమరియుగ్రీనవర్తోగణనీయమైనమెరుగుదల,పరిపాలన మరియు కార్పొరేట్ సిఎస్ఆర్ మధ్య సమర్థవంత మైన సమన్వయంద్వారాసాధించబడిందని ఆయన అన్నారు.



# ఆర్ టి సి కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించండి.. సిఐటియు డిమాండ్,

అక్షర కలం / భద్రాచలం

భద్రాచలం ఆర్టిసి కార్మికుల సమస్య పరిష్కారం కోసం సమ్మెలోకి దిగిన కార్మికులకుసిపిఎంసిఐటియుసంపూర్ణ మద్దతు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం బీ నర్సారెడ్డి సిఐటియు జిల్లా నాయకులు వై వి రామారావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని జరుగుతున్నటువంటి ఈ సమ్మెకు సిపిఎం సీఐటీయూ సంపూర్ణ మత తెలియజేస్తుందని గత ప్రభుత్వం హయాంలో జరిగిన సమ్మెలో అగ్రభాగాల నిలిచామని విజయం సాధించేంతవరకు పోరాటం చేయడం జరిగిందని ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే పరిష్కారం చేయాలని ప్రభుత్వంలో విలీనం ఇతర కార్మిక సమస్యలను పరిష్కరించాలని కార్మికులనుపెట్టిచాకిరిచేయించుకుంటూ వారికి రావలసిన రాయితీలను ప్రభుత్వం ఇవ్వట్లేదని ఈ కాలంలో ఆర్టీసీ కార్మికుల పై వేధింపులు పెరిగాయని పని వారం పెరిగిందని కొత్త ఉద్యోగాలు ఇస్తామని ఉద్యోగ భద్రత లేకుండా వ్యవహరిస్తుందని ఆర్టీసీ కార్మికులు అనివార్యంగా సమ్మెకు వెళ్లే పరిస్థితి ప్రభుత్వం తీసుకు వచ్చిందని వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సమస్యను పరిష్కరించాలని లేకుంటే కార్మికుల



పక్షానసిపిఎంసిఐటియునిల బడుతుందనివారన్నారుఈకార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు. శరత్ బాబు,ఎస్ డబ్ల్యూ ఎఫ్ సిఐటియు నాయకులు ఎం వి ఎస్.నారాయణ,ఎన్.నాగరాజు,ఎస్. అజయ్ కుమార్,రాయల.రాములుప్రతాప్, ప్రసాద్,బాలు,బి ఎన్.రావు, తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపినారు

# సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులు వేగవంతం చేసి వర్షాకాలానికే గోదావరి జలాలు అందించాలి

అధికారులు అలసత్వం వీడి పనులు ముమ్మరం చేయాలి

గోదావరి జలాలతో ఉభయ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయి

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అక్షర కలం ఖమ్మం ప్రతినిధి





సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి సత్తుపల్లి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యతలకుంటలో ఉమ్మడి జిల్లా అధికారులతో కలిసి, అశ్వరావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు నుంచి యతలకుంట వరకు సాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జులు, రోడ్డు క్రాసింగ్లు, కాలువ పనుల అమలులో ఉన్న లోపాలు, సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేసి, ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారుఅనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు అలసత్వాన్ని విడిచిపెట్టి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా సుమారు 43 కిలోమీటర్ల పొడవున 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మొత్తం రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు సుమారు రూ.600 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు.యతలకుంట టర్మినల్‌కు సంబంధించిన మొత్తం 1.78 కిలోమీటర్ల పనుల్లో చివరి 30 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరిలో వరదలు వచ్చేలోపు టర్మినల్ ఎగువ భాగంలోని స్ట్రక్చర్ నంబర్లు 5 నుంచి 10 వరకు ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మే నెలాఖరులోగా అసంపూర్తిగా ఉన్న అన్ని స్ట్రక్చర్ల పనులను పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే టన్నెల్ ఎగువ భాగంలో ఉన్న ఆరు స్ట్రక్చర్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు.భూసేకరణకు అవసరమైన నిధులు పూర్తిగా మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కోర్టు కేసులు లేదా భూసంబంధిత సమస్యల కారణంగా ఎక్కడైనా పనులు ఆలస్యమైతే వెంటనే జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చిన్నచిన్న భూ సమస్యల కారణంగా పనులు నిలిచిపోవడం సమంజసం కాదని, రైతులతో చర్చించి సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలను సమయానికి తెలియజేయకుండా పనులు నిలిపివేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.భూసేకరణలో కొన్ని సమస్యలు, అవసరమైన అనుమతులు ఇంకా పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వాటిని త్వరితగతిన పరిష్కరించి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కోర్టు కేసుల కారణంగా మరో ఒక కిలోమీటర్ కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయకట్టు ఖమ్మం జిల్లా పరిధిలో ఉండగా, నిర్మాణ పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో కొనసాగుతున్నందున ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఒక్క కిలోమీటర్ పనుల కోసం వేల కోట్ల వ్యయం జరుగుతున్న ఈ ప్రాజెక్టులో చిన్న కారణాల వల్ల పనులు నిలిచిపోవడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ఏ సమస్య వచ్చినా వెంటనే జిల్లా కలెక్టర్లు లేదా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.యతలకుంట టన్నెల్ నిర్మాణంపై గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్ణయం తీసుకుని కేవలం రెండు సంవత్సరాల్లో టన్నెల్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి రాత్రింబవళ్లు పని చేసి ఈ సీజన్‌లోనే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# రైతు పక్షపాతి మన ప్రభుత్వం

- సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్
- ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్ల రుణమాఫీ
- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి

అక్షర కలం/ పాలేరు:



నేలకొండపల్లి : రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలంగాణ



రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం నేలకొండపల్లిలో నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు.

**- అన్నదాతకు అండగా నిర్ణయాలు**

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. నాడు వరి వేస్తే ఉరి అన్న పాలకులకు భిన్నంగా, నేడు సన్న వడ్ల సాగును ప్రోత్సహిస్తూ మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. రైతులు పండించిన పంటను విక్రయించిన వెంటనే, ఆలస్యం లేకుండా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నామని వివరించారు.

**- మాట నిలబెట్టుకున్న రేవంత్ సర్కార్**

ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇచ్చిన ప్రతి మాటను ప్రభుత్వం నెరవేరుస్తోందని పొంగులేటి స్పష్టం చేశారు. గత పాలకులు ఐదేళ్లలో చేయలేని రుణమాఫీని, తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్లు విడుదల చేసి 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసిందని గుర్తు చేశారు. గతంలో రైతు బంధు కింద రూ. 10 వేలు అందిస్తే, ప్రస్తుతం రైతు భరోసా ద్వారా రూ. 12 వేలు అందిస్తున్నామన్నారు.

**- విస్తృతంగా గోదాముల నిర్మాణం**

రైతులు పండించిన పంటను భద్రపరుచుకునేందుకు వీలుగా రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని 200 శాతం మేర పెంచేలా కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రైవేటు రంగానికి దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కోల్డ్ స్టోరేజీలను నిర్మించి




త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ వంటి అనేక సంక్షేమ పథకాలను అప్పుల భారం ఉన్నప్పటికీ చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కళావాహన కార్యక్రమం.. ఈవో. దామోదర్ రావు,

అక్షర కలం / భద్రాచలం





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భద్రాచల ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా,నిర్మాణపనులుసందర్భంగా ఆలయంలోగలచుట్టూగుళ్ళునందలిదేవతామూర్తులను రంగనాయకుల గుట్టపై గల శ్రీరామదాసు ధ్యాన మందిరంవద్దగలబాలల యంన ందుమరియుఆండాళ్అమ్మవారు.లక్ష్మి తయారుఅమ్మవారుప్రధానదేవాల యం నందలి ముఖ మండపం నందు ఏర్పాటు చేయుటకు గాను ఆదివారం రోజున అనగా ఇరవై అరో తారీకు న కళావాహన కార్యక్రమం నిర్వహించుటకువైదికపెద్దలునిర్ణయించినందున అట్టి రోజున అనగా ఆదివారం రోజున అనగా ఇరవై ఆరో తారీకు న మధ్యాహ్నం ఒంటిగంట వరకు అన్ని రకములైన అర్జిత సేవలుమరియుదర్శనములునిలుపుదలచేయ ‍ునైనదితిరిగిఅదేరోజున మధ్యాహ్నంమూడుగంటలనుండి భక్తులనుద ర్శనములకుఅనుమతించబడునుకావ ునఈయొక్కమార్పులనుభక్తులుగమనించగలరనిఈవోతెలియజేశారు.

# నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22:

భూమి అభివృద్ధిలో భాగంగా వెంచర్ల ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో వెంచర్ ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులకు సంబంధించి భూమిని పట్టణ ప్రణాళిక అధికారి సంపత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వెంచర్ల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను సరిచూసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# దానవాయిగూడెం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన "-మంత్రి పొంగులేటి"- "చల్లా కృష్ణ"

అక్షర కలం/ దానవాయిగూడెం:



ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం 59వ డివిజన్ దానవాయిగూడెం కి చెందిన 13 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా క్యాంప్ కార్యాలయం లో లిఖమ్మం టౌన్ జనరల్ సెక్రటరీ చల్లా కృష్ణ మరియు డివిజన్ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారుల సమక్షంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేయడం జరిగింది , ఈ కార్యక్రమం లో 59 వ డివిజన్ దానవాయిగూడెం గ్రామం నుండి కళ్యాణి లక్ష్మి చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలు లేక రైతుల అవస్థలు

కల్లాలో రైతు పడికాపులు

హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరించాలి – సీపీఐ(ఎం)



అక్షర కలం/ కారేపల్లి:

కారేపల్లి : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర లు అన్నారు. బుధవారం కారేపల్లి మండలం మాదారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ(ఎం), రైతు సంఘం నాయకులు సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు హమాలీలకు చెల్లిస్తున్న రేట్లు, కాంటాలు, లారీల కొరతపై ఆరా తీశారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకుల మాట్లాడుతూ కారేపల్లి మండలంలో 10 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేసినా ప్రభుత్వం కేవలం మారుమూల ఉన్న మాధారం ఒక కొనుగోలు కేంద్రాన్ని మాత్రమే ఏర్పాటు చేసిందన్నారు. రేలకాయలపల్లి, చీమలపాడు, తొడితలగూడెం, పోలంపల్లి, కమలాపురం రైతులు మాధారం కేంద్రాన్ని వచ్చి మొక్కజొన్న అమ్మకాలు సాగించటం అవస్థలతో కూడుకున్నదన్నారు. దీంతో ప్రయివేటు వ్యాపారస్తులకు అరకొర ధరకు అమ్ముకుంటూ ఆర్థికంగా తీవ్రనష్టపోతున్నారన్నారు. మొక్కజొన్న దిగుబడి 50 క్వింటాళ్లు ఉండగా కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గిరిజనేత ప్రాంతాలలో యధేచ్ఛగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే గిరిజన ప్రాంతమైన కారేపల్లి మండలంలో కేవలం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయటం వివక్షతకు నిదర్శనమన్నారు. మారుమూల గ్రామాల నుండి మాదారం కేంద్రాన్ని మొక్కజొన్న తీసుకరావటం ఖర్చుతో కూడుకున్నదన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో హమాలీ ఖర్చు రైతులే భరించాల్సి వస్తుందన్నారు. హమాలీ ఖర్చు ప్రభుత్వమే భరించాలన్నారు. లారీ మాముళ్ల పేరుతోబస్తాకు రూ.5 ఇవ్వాలని లారీ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారన్నారు. లారీ దిగుమతికి వారం రోజులు పడుతుందని వెయిటింగ్ ఖర్చుల కోసం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. గోదాంల వద్ద కూడా వసూళ్ల పర్వం సాగుతుందని ఇది అంతా రైతులే భరించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఖర్చులు అన్ని చూచుకుంటే ప్రయివేటే నయమంటూ రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. రైతుకు ఎలాంటి ఖర్చులు లేకుండా మొక్కజొన్న ధాన్యంను ప్రభుత్వం తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై రైతు సంఘం ఆధ్వర్యంలో జరిపే పోరాటాలకు మద్దతు ఇవ్వాలని రైతులను కోరారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మొక్కజొన్న రైతుల ఇబ్బంది, అదనపు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రాధాన్యత గురించి కొనుగోలు కేంద్ర వద్ద నుండి రైతుల సమక్షంలో సీపీఐ(ఎం) నాయకులు ఫోన్ ద్వారా వివరించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అదనపు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం నడుస్తున్న కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బంది జరగకుండా చూడాలని సీఈవో బొల్లు హనుమంతరావు కు సూచించారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావ, నాయకులకు తుమోజు రామ్మూర్తి, పాపినేని నాగేశ్వరరావు, పొట్లకాయల రమేష్, జడల నాగేశ్వరరావు, రజిని, కిలారి అప్పారావు, బానోత్ సీతారాములు, ధర్మసోత్ అశోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు ప్రకటన

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

కాళేశ్వరం సాగునీటి పథకానికి సంబంధించి పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై తెలంగాణ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పును బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్వాగతించారు.కమిషన్ నివేదికను ఆధారం చేసుకుని ఎటువంటి చర్యలు చేపట్టవద్దని హైకోర్టు స్పష్టం చేసిందని ఎంపీ రవిచంద్ర తన ప్రకటనలో పేర్కొన్నారు.కమిషన్ విచారణ సందర్భంగా ప్రాథమిక న్యాయ సూత్రాలు,నిబంధనలు పాటించలేదని హైకోర్టు తీర్పుపేర్కొన్నదని,దీంతో ఆ నివేదికకు చట్టబద్ధత లేదని తేటతెల్లమైందని ఆయన వివరించారు.ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ఎలాంటి నోటీసులివ్వకుండా కేవలం ఆరోపణలు చేయడం సమంజసం కాదని హైకోర్టు స్పష్టం చేసిందన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు,మాజీ మంత్రి,బీఆర్ఎస్ఎల్పీ ఉప నేత తన్నీరు హరీష్ రావులపై రాజకీయంగా ఒత్తిడి తెచ్చే దురుద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడడం తీవ్ర అభ్యంతరకరమని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం బహుళదశ సాగునీటి పథకంపై నిరాధారమైన కథలు ప్రచారం చేసి కేసీఆర్ గౌరవ ప్రతిష్టలను దెబ్బతీయాలనే కుయుక్తితో కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు.



ప్రాజెక్టుకు చేపట్టవలసిన మరమ్మతులను సకాలంలో మొదలుపెట్టకుండా రెండున్నరేళ్లు ఆలస్యం చేసి,తప్పని పరిస్థితుల్లో ఇప్పుడు ప్రారంభించారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.కాళేశ్వరం విషయంలో కేసీఆర్, హరీష్ రావులపై చేసిన ఆరోపణలు నిరాధారమని హైకోర్టు తాజా తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్, బీజేపీల వైఖరిలో ఇప్పటికైనా మార్పు రావాలన్నారు.అంతిమంగా న్యాయం, ధర్మమే గెలుస్తుందనే విశ్వాసానికి హైకోర్టు తీర్పు ప్రబల నిదర్శనమని, పాలకులకిది చెంపపెట్టు వంటిదని ఎంపీ వద్దిరాజు వ్యాఖ్యానించారు.

# పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలి.....

- నిజాన్ని వెలికి తీయాలి అబద్ధాన్ని స్వాగతించవద్దు....
- ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించాలి.....
- నిజమైన, అర్హత గల జర్నలిస్టులకు కార్డులు అందాలి.....
- డెస్క్ జర్నలిస్టుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.....
- మెదక్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్పర్సన్ ,కలెక్టర్ ప్రతిమా సింగ్......

మెదక్/ కొల్చారం ఏప్రిల్ 22(అక్షర కలం):-

నిజమైన ,అర్హత గల జర్నలిస్టుల కే అక్రిడేషన్ కార్డు అందాలని జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ ప్రతిమాసింగ్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు, డిపిఆర్ఓ, అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా నియామకమైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దరఖాస్తులు ఎన్ని వచ్చాయో అని డిపిఆర్ఓ ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు విధానం, అడిగి



తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న మీడియా ప్రతినిధులకు అక్రిడియేషన్ కార్డుల జారీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ జరగాలన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా ఒక ప్రధాన వేదికగా ఉంటుందనీ పేర్కొన్నారు. అందువల్ల మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి వివక్ష లేకుండా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందినీ ,అక్రిడిటేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా సమగ్రంగా పరిశీలించి, అర్హత ప్రమాణాలు పూర్తిచేసిన అభ్యర్థులకు మాత్రమే కార్డులు జారీ చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం ఖచ్చితంగా పరిశీలించడంతో పాటు, అవసరమైన పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలనీ కమిటీ సభ్యులకు సూచించారు. ఎటువంటి అనర్హులుకు కార్డులు జారీ కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి, వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మీడియా ప్రతినిధులు సమర్పించే దరఖాస్తుల్లో వృత్తి సంబంధిత ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకోవాలనీ తెల్చి చెప్పారు. నకిలీ ధృవపత్రాలు సమర్పించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటమన్నారు. అక్రిడిటేషన్ కార్డులు పొందిన మీడియా ప్రతినిధులు తమ వృత్తి నైతిక విలువలను పాటిస్తూ, సమాజానికి బాధ్యతాయుతంగా సేవలందించాలన్నారు. ప్రజలకు నిజమైన సమాచారం అందించడం, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రచారం చేయడం, సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడం వంటి అంశాల్లో మీడియా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలనీ, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలన్నారు.ప్రతి దశలో పారదర్శకతను పాటిస్తూ, ఎటువంటి వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నాగేష్, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, డిప్యూటీ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ భూపాల్, కమిటీ సభ్యులు అశోక్, గోపాల్ గౌడ్, దేవరాజ్, శ్రీధర్, ఫరూక్ హుస్సేన్, శంకర్ దయాల్ చారి, సురేందర్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస చారి, ఏపీఆర్ఓ బాబురావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులను రెచ్చగొడుతున్న బిఆర్ఎస్ నాయకులు

పొద్దు తిరుగుడు రైతులు అధైర్యపడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

పొద్దుతిరుగుడు పంట చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

గతంలో లాగే కేంద్ర కోట నుండి రాష్ట్ర కోటకు మార్చే ప్రక్రియలో కొంత ఆలస్యం

ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి చొరవ తో వెంటనే కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 22:

అధికారంలో వున్నప్పుడు రైతులను పట్టించుకోకుండా దోచుకొని దాచుకొవడానికె సమయం కేటాయించి అధికారం కోల్పోయాక మాత్రం రైతులపై మొసలి కన్నీరు కారుస్తూ పొద్దు తిరుగుడు కొనుగోలు విషయంలో బి ఆర్ స్ నాయకులు రైతులను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలిఅనుకోవడం సిగ్గుచేటన్నారు ఈ సందర్భంగా చిన్నకోడూరు మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ మాట్లాడుతూ గత బి ఆర్ స్ ప్రభుత్వ హయాంలో చిన్నకోడూరు లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం లేక రైతులు సిద్దిపేట కు తీసుకువెళితే ట్రాన్స్పోర్ట్ భారం రైతులపై పడొద్దనే ఉద్దేశ్యంతో అప్పటి ఇంచార్జ్ మంత్రి కొండాసురేఖ చొరవతో ఎఫ్ ఎస్ సి ఎస్ అల్లీపూర్ సొసైటీ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందాన్నారు. అందులో భాగంగా ఈ సీజన్ లో గతంలో కంటే భిన్నంగా జిల్లాలోనే అత్యధికంగా 1900 వందల ఎకరాల్లో పొద్దుతిరుగుడు సాగు చేస్తే అందుకు అనుగుణంగా ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు వివేక్ వెంకట స్వామి ఆదేశాలతో గతంలోకంటే ముందుగానే కొనుగోలు కేంద్రం ప్రాంభించారన్నారు. అంతేకాకుండా మా ఏఎంసీ పాలక వర్గం ఆధ్వర్యంలో పొద్దుతిరుగుడు కేంద్రాన్ని





సందర్శించి రైతులకు లారీలు రాక ఇబ్బంది పడుతున్నారని తెలిసి వెంటనే ఇంచార్జ్ మంత్రి సహకారం తో సమస్య పరిష్కరించడం జరిగిందన్నారు.ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ కోటాలో 2800 క్వింటాల్లు వరకు కొనుగోలు పూర్తి చేసి వెంటనే రాష్ట్ర ప్రభుత్వ కోటకు డైవర్షన్ చేసే ప్రక్రియ లో బాగంగా గతంలో లాగానే కొంత గ్యాప్ రావడం జరిగిందన్నారు. ఇట్టి పొద్దు తిరుగుడు కొనుగోలు విషయంలో గత బి ఆర్ స్ ప్రభుత్వ హయాంలో హరీష్ రావ్ ఆర్థిక మంత్రి హోదాలో వున్నప్పుడు కూడా పొద్దుతిరుగుడు కొనలేక సుమారు 20 రోజుల పాటు కొనుగోలు నిలిచిపోయిన విషయాన్నీ గుర్తు చేశారు. అంతేకాకుండా మొక్క జొన్న కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించి రైతులకు సిద్ధంగా ఉంచిన ఈ బి ఆర్ స్ నాయకులు ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. హరీష్ రావ్ కు రైతులపై చిత్త శుద్ధి ఉంటే ఇప్పటికైనా ఎఫ్ ఎస్ సి ఎస్ అల్లీపూర్ సొసైటీ లో మందు బస్తాల కొనుగోలు మరియు రైతుల రుణాలు జమ విషయంలో తన అనుచరుడు అయిన చైర్మన్ సుమారు 50 లక్షల అవినీతి చేశాడు. అని కాంగ్రెస్ కార్యకర్తలు అయినా మేము పిర్యాదు చేసి ధర్నాలు చేస్తే విచారణ చేసి అవినీతి జరిగిందని అధికారులు తెల్చినప్పటికి కమిటీ ని రద్దు చేసి సొమ్ము రికవరీ చేయకుండా అడ్డుకోవడం హరీష్ రావ్ సిగ్గుమాలిన తనానికి నిదర్శనమన్నారు. అంతేకాకుండా రైతుల సొమ్ముతో ఏఎంసి మార్కెట్ ఆఫీస్ 2017 లో సుమారు 60 లక్షల రూపాయలతో బి ఆర్ స్ నాయకుల కాంట్రాక్టర్ లబ్ధికోసం ఇష్టనుసారంగా నిర్మిస్తే అది చిన్నపాటి వర్షానికి ఉరిస్తే దానిని ఇప్పటికే రెండు సార్లు మరొక 15 లక్షల తో సరి ఘనత హరీష్ రావ్ కు అతని అనుచరులకె దక్కుతుందన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం పై బురద జల్లుడు రాజకీయలు మానుకొని సలహాలు సూచనలు ఇస్తే బాగుంటుందాన్నారు. పొద్దుతిరుగుడు రైతులు అధైర్యపడొద్దని కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం అని చివరి గింజ వరకు కొంటుందని ఈ విషయం ఇంచార్జ్ మంత్రి తో మాట్లాడితే ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే కొనుగోలు చేపట్టేలా చూస్తనని హామీ ఇచ్చారాన్నారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ బుస్సా రాజశేఖర్ డైరెక్టర్లు వినోద్, రాజ వర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, విజయ్ రెడ్డి,, భూపతి రెడ్డి ,అశోక్ గౌడ్ , లక్ష్మి, రాజు ,ఎండి సలీం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సందబోయిన పరుశు రాం, గ్రామ అధ్యక్షులు గొట్టిపర్తి తదితరులు పాల్గొన్నారు.

# నూతన బోరు మోటార్లను ఆన్ చేసిన..... - నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి....

మెదక్ /కొల్చారం ఏప్రిల్ 22(అక్షర కలం):-

కొల్చారం మండల కేంద్రంలో ఒకటో వార్డు, ఐదవ వార్డులలో నీటి సమస్య నివారణ కోసం నూతనంగా రెండు బోరుబావులం తవ్వించి వాటిలో సింగల్ ఫేస్ మోటర్లు పెట్టిన సందర్భంగా బుధవారం నాడు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి గారి చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ దేవనగారి శేఖర్ గారి ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి మోటార్లను స్విచ్ ఆన్ చేయించడం జరిగింది . ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్, ఉపాధ్యక్షులు ముత్యం గారి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అక్రమ్, అంసానిపల్లి మాజీ సర్పంచ్ మన్నె శ్రీనివాస్, జలాల్పూర్ సర్పంచ్ దేవ్ సింగ్, ఉప సర్పంచ్ వెంకట నర్సింలు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ లక్ష్మయ్య, సీనియర్ నాయకులు ఏల్లు గారి శ్రీనివాస్ రెడ్డి, రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షులు గొండ కృష్ణ, వసంతం, ఉపసర్పంచ్ సుధాకర్, అప్పాజీపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఫహజ్ పాషా, కొల్చారం గ్రామ శాఖ అధ్యక్షులు ఆశన్న గారి శ్రీశైలం, వార్డు సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొల్చారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## ఐదేళ్లకొకసారు ఘనంగా ఎల్లమ్మ బండారు ఉత్సవం..

### గ్రామవాసులు భక్తిభావంతో పాల్గొన్నారు ;





**(అక్షర కలం, నారాయణపేట జిల్లా, రిపోర్టర్, ఏప్రిల్,22)**

నారాయణపేట జిల్లా, ధన్వాడ మండలం యంనోనిపల్లి గ్రామంలో బుధవారం (ఏప్రిల్ 22, 2026) గోటూరు కులస్తుల ఎల్లమ్మ బండారు ఉత్సవం అపార భక్తిభావంతో ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామంలో దాదాపు 50 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఐదేళ్లకొకసారు జరిగే ప్రసిద్ధ ఉత్సవం, గోటూరు బన్నేనోళ్ల కులస్తుల కుటుంబాలకు ప్రత్యేకమైనది. గ్రామంలోని ప్రాచీన ఎల్లమ్మ అమ్మవారి సాక (క్షేత్రం) చుట్టూ ఈ ఆచారాలు కేంద్రీకరించబడతాయి.

**పూజా కార్యక్రమాలు, బలి విధానాలు**

ప్రత్యేకంగా శుభ్రపరచి, మాళలు, పూలతో అలంకరించిన స్థలంలో ఉదయం 8 గంటలకు పూజారులు మల్లప్ప, రాజు, ఎల్లప్ప, చిన్న రాజప్పలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వేద మంత్రాలు, శ్రీ చక్రార్చన, అభిషేకాలతో అమ్మవారికి సేవ చేశారు. భారీ సంఖ్యలో గ్రామస్తులు, పొర్పు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు హాజరై, దీవెల వెలిగించి, ప్రదక్షిణలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా గొర్రెలు, మేకపోతులు బలిచ్చి, ఆచారాలు పూర్తి చేశారు.

**బండారు ఆచారం: కుటుంబ ఐక్యత ప్రతీక**

ఉత్సవ ముఖ్య ఆకర్షణగా గోటూరు బన్నేనోళ్ల 33 కుటుంబాల కుర్వ కులస్తులపై (ప్రత్యేక గొర్రెల చర్మాలు) బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు బండారు (నీళ్లు చల్లడం) చేశారు. ఇది కుటుంబ ఐక్యత, భక్తి, శుభకర ఆశీస్సుల ప్రతీకంగా పరిగణించబడుతుంది. ఈ ఆచారం దాదాపు మూడు గంటల పాటు జరిగి, గ్రామవాసుల మధ్య ఉత్సాహాన్ని రేకెత్తించింది.

**భోజనం, అతిథి సత్కారం**

ఉదయం 11 గంటల తర్వాత అతిథులకు వారి ఇంట్లో ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేశారు. ఊరు పొర్కలు, పులిహోర, పొంగల్, పెసరట్టు వంటి సాంప్రదాయ వంటకాలతో సత్కారం చేశారు. ఈ ఉత్సవం గ్రామంలో ఐక్యతను పెంచి, సామాజిక సంబంధాలను మరింత బలోపేతం చేసింది. ప్రముఖుల పాల్గొన్నారు గ్రామ సర్పంచ్ బోయ్ నాగేష్, ఉపసర్పంచ్ సిద్దప్ప, మాజీ సర్పంచ్ భారతి సచిన్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ గౌని శ్రీనివాస్ ముదిరాజ్, కాశీనాథ్ రెడ్డి, కుర్మయ్య, అశోక్, శ్రీనివాస్, రాములు, సిద్ధప్ప, రాజు, బీరప్ప తదితరులు పాల్గొని, ఉత్సవ విజయవంతం కావాలని ఆశీస్సులు కల్పించారు. ఈ ఉత్సవం యంనోనిపల్లి గ్రామ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచింది. భవిష్యత్‌లో కూడా ఇలాంటి ఆచారాలు కొనసాగాలని గ్రామవాసులు ఆకాంక్షిస్తున్నారు.

## నిజాలు నిలకడ మీద తేలుతాయి

### అబద్ధానికి వేగం ఎక్కువ కానీ నైతికత ఉండదు, అలాగే న్యాయ సమ్మతి అసలే ఉండదని మరోసారి రుజువయ్యిందిలి

### - హైకోర్టు తీర్పు పై హర్షం వ్యక్తం చేసిన బి ఆర్ ఎస్ నేతలు...

**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 22:**

నేటి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు రేవంత్ రెడ్డి కాలేశ్వరం విషయంలో ఆడుతున్న కపటనాటకాలకి అడ్డుకట్ట వేసిందని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, శ్రీహరి యాదవ్, ఆంజనేయులు, రెడ్డి ప్రభాకర్ రెడ్డి లు అన్నారు.. తప్పుదారిలో నడిచితప్పులు చేసిన మనిషి తన మీద వచ్చిన వ్యతిరేకతని కపిపుచ్చుకోవడానికి తన కంటిన లేదా తనే రుద్దుకున్న బురదను తుడిపేసుకోకుండా ఇతరుల మీద బురద చల్లి అందరూ తన లాంటివాళ్లేనని చెప్పే ప్రయత్నంలో భాగమే ఈ కాలేశ్వరం తప్పుడు కేసు ఆధారాబాదరాగా పీసీ ఘోష్ కమిషన్ వేసి న్యాయబద్ధత చట్టబద్ధతలేని తప్పుడు పద్ధతిలో విచారణ జరిపి ఎన్నికల సందర్భంలో ప్రజల్లోకి వెళ్లి తను ఇచ్చిన హామీలను తను అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఏవి లేనందున కేవలం గత ప్రభుత్వం మీద నిందారోపణలు చేసి దుష్ప్రచారం చేసి ఎన్నికలు వచ్చినప్పుడల్లా గ్రామపంచాయతీ ఎన్నికలప్పుడు, పార్లమెంటు ఎన్నికలప్పుడు మళ్లీ ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి అని తెలిసి అటెన్షన్ డైవర్షన్ చేసే ఏకైక విధానాన్ని గత రెండున్నర సంవత్సరాలుగా అమలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు,



వీటన్నిటికీ చెంపపెట్టు లాంటి తీర్పే నేటి హైకోర్టు ఉత్తర్వులు ఇకనైనా రేవంత్ తప్పుడు ఆరోపణలు చేయడం, దుర్భాషలాడడం, కమిషన్ల పేరుతో కాలమెల్ల తీయడం మానుకొని, ఇచ్చిన హామీల అమలు కోసం ఏదో మేరకు ప్రయత్నం చేయాలని ఇకనుంచయినా వంచన, నయవంచన పాలనకు స్వస్తి పలికి,ప్రజాపాలన కు శ్రీకారం చుట్టాలని, లేనిఎడలా రానున్న రోజుల్లో ప్రజల నుంచి వస్తున్నటువంటి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ నరేందర్, పర్శరాములు గౌడ్,మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెతో జిలాల్లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు...

### - జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్....

**మెదక్/ కొల్చారం ఏప్రిల్ 22(అక్షర కలం):-**





ఆర్టీసీ సమ్మె దృశ్య ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేస్తాం అన్నారు. ప్రైవేట్ వాహనదారులు ఎక్కువ ఛార్జ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమర్జెన్సీ అవసరాల కోసం కంట్రోల్ నంబర్ 9391942254 ఏర్పాటు చేశాం అని ,ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మె వల్ల జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సమ్మె తో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలుతీసుకుంటున్నామన్నారు.జిల్లాలోని మెదక్, నర్సాపూర్ బస్ డిపోల నుంచి బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. మెదక్ నుంచి 100, నర్సాపూర్ నుంచి 34 బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.రెండు బస్ డిపోల పరిధిలో కొత్తగ కండక్టర్ లను నియమిస్తున్నం అని, అదే విధంగా గతంలో ఆర్టీసీ డ్రైవర్ ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిని పరిశీలించి తీసుకుని వారి సేవలువినియోగించుకుంటున్నం అన్నారు. పోలీస్ , రెవెన్యూ, రవాణా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్, కంపెనీ ల వారిని సహకరించాలని కోరడం జరిగిందని వారి సహకారంతో ప్రజల అవసరాల మేరకు వారికి బస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎమర్జెన్సీ అవసరాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అవసరం ఉన్నవారు 9391942254 నంబర్ లో సంప్రదించాలని కోరారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఎవరైనా ప్రైవేట్ వాహనదారులు అధిక ఛార్జీ లు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య,డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఉసురు ఊరికే పోదు

**కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పొద్దు తిరుగుడు మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే రాజీవ్ రహదారి దిగ్బంధం చేస్తాం**

**రైతులకు శాపంగా మారిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

**పొద్దు తిరుగుడు మక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

**కాంగ్రెస్ పాలనలో కష్టాలు తప్ప రైతులకు చేసింది ఏమీ లేదు**

**రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో పోసి నెలల తరబడి ఎదురుచూస్తున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదు**

**పొద్దు తిరుగుడు మొక్కజొన్నల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి**

**రాధాకృష్ణ శర్మ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కాముని శ్రీనివాస్ పార్టీ మండల అధ్యక్షులు**





**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 22:**

రైతులు పండించిన పొద్దు తిరుగుడు మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతుందని ఎద్దు ఏడ్చిన యవసం రైతు ఏడ్చిన రాజ్యం నిలబడదని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్ లు అన్నారు.బుధవారం రోజు చిన్నకోడూరు మండల కేంద్రంలో చేపట్టిన రైతు మహాధర్నలో పాల్గొని మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో నమ్మబలికిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టగానే రైతుల గురించి ఆలోచన చేయడం లేదని వరంగల్ సభలో రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిలు రైతు డిక్లరేషన్ పేరుతో సభలు నిర్వహించి మోసపూరిత డిక్లరేషన్ చేసి ప్రభుత్వం రాగానే వాగ్దానాలను విస్మరించి రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అనేక ఇబ్బందులకు రేవంత్ రెడ్డి గురి చేస్తున్నాడని బి ఆర్ ఎస్ ప్రభుత్వం లోని కెసిఆర్ హరీష్ రావుల ఆధ్వర్యంలో రైతు శ్రేయస్సు ధ్యేయంగా పనిచేస్తూ రైతులకు కరువు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రైతులకు సాగునీరు అందించి లక్షల ఎకరాలలో పండిన పంట ధాన్యాలను సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఒక ఎత్తు మిగలకుండా పూర్తిగా ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఘనత కేసిఆర్ హరీష్ రావులకే దక్కుతుందని అన్నారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా కూడా విమర్శలు చేస్తూ పూట గడుపుతున్నాడు తప్పితే రైతుల కోసం రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కోసం ఏమాత్రం ఆలోచన చేయడం లేదని కేవలం ప్రభుత్వ ధనాన్ని వృధా చేస్తూ ప్రజా మీటింగ్ లు పెట్టుకుని ప్రతిపక్ష పార్టీని విమర్శించుకుంటూ కాలం గడుపుతున్నాడని మండిపడ్డారు.90 రోజుల ప్రజా పాలన పేరుతో గ్రామాలకు ఒరిగింది.కూడా ఏమీ లేదని ప్రజా పాలన సమావేశాలకు మంత్రులు కాదు కదా ఒక ఎమ్మెల్యే కూడా హాజరు కాలేదని రేవంత్ రెడ్డి గారికి దమ్ము ధైర్యం ఉంటే గ్రామాలలో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు ప్రజలకు ఏం చేసిందో వివరించాలని డిమాండ్ చేశారు.రెండు రోజుల్లో మార్కెట్కు వచ్చిన పొద్దు తిరుగుడు మొక్కజొన్నల ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ లు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ మండల సీనియర్ నాయకులు, మండల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు తర్వాత కాళేశ్వరంపై రాజకీయ దుమారం

### బీజేపీ-బీఆర్ఎస్ పై కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఫైర్

**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 22:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కమిషన్ నివేదిక ఆధారంగా తక్షణ చర్యలు తీసుకోవద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించగా, నివేదిక రూపకల్పనలో విధానపరమైన నిబంధనలు పూర్తిగా పాటించలేదని అభిప్రాయపడింది. అయితే, కమిషన్ ఏర్పాటు మాత్రం చట్టబద్ధమేనని కోర్టు స్పష్టం చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హైకోర్టు తీర్పును తాము గౌరవిస్తున్నామని పేర్కొన్న ఆయన, కోర్టు ఎక్కడా కమిషన్‌ను గానీ, దాని విచారణను గానీ, నివేదికను గానీ తప్పుబట్టలేదని స్పష్టం చేశారు. కేవలం విధానపరమైన అంశాలపైనే అభ్యంతరం వ్యక్తం చేసిందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినది అనేది వాస్తవమని చెబుతూ, ఈ కుంభకోణానికి బాధ్యులైన వారిని ఎప్పటికైనా చట్టం ముందు నిలబెట్టి జైలుకు పంపడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రాజెక్టును దోపిడీకి వేదికగా మార్చిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే సమయంలో బీజేపీపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. గతంలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్‌కు ఏటీఎంగా అభివర్ణించారని గుర్తు చేశారు. దోషులను జైలుకు పంపుతామని చెప్పిన కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి నేతలు ఇప్పుడు ఎందుకు



మౌనం వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సీబీఐ ద్వారా విచారణ ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నిస్తూ, బీజేపీ-బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య ఒప్పందమే దీనికి కారణమని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంలో నిజాలు బయటపడకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా రెండు పార్టీలూ వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మొత్తంగా హైకోర్టు తీర్పు కాళేశ్వరం అంశాన్ని మరింత రాజకీయ వేడి పెంచగా, భవిష్యత్తులో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అమ్మ దీవెనలు అందరిపై ఉండాలి

**మిట్టపల్లి అభివృద్ధి కల్పవల్లి**

**10ఏళ్లలో మిట్టపల్లి ని దేశానికే ఆదర్శం గా నిలుపుకున్నాం**

**కాళేశ్వరం నీళ్లతో ఎటు చుసిన పచ్చని పంట పొలాలు**

**రేణుక ఎల్లమ్మ దీవెన తో అన్నింటా మంచి జరగాలి**

**మిట్టపల్లి గ్రామం లో రేణుక ఎల్లమ్మ కళ్యానోత్సవం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 22:**

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామం లో జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యానోత్సవం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతు ఎల్లమ్మ దేవాలయం కళ్యానోత్సవం ఘనంగా జరిగింది.ఈ ఉత్సవాలకు నావంతు సహాయం కూడా అందించానన్నారు. మిట్టపల్లి గ్రామం అభివృద్ధి లో కల్పవల్లి అని, 10ఏళ్లలో అభివృద్ధి లో దేశానికి ఆదర్శం గా నిలుపు కున్నామని చెప్పారు.కాళేశ్వరం నీళ్లతో ఈ ప్రాంతం పచ్చని పంట పొలాల తో కళకళ



లాడుతుందన్నారు.ఇటీవలె రైతులకు గౌడన్నలకు ఇబ్బంది అవుతుంది అంటే 47లక్షలతో ఫిడర్ చానల్ వద్ద బ్రిడ్జ్ మంజూరు చేసుకున్నామన్నారు..త్వరలోనే దేవాలయం వద్ద ప్రహరీ గోడ, సిసి ప్లాట్ ఫామ్ చేసుకుందామన్నారు, అదేవిదంగా రాజీవ్ రహదారి నుండి మిట్టపల్లి గ్రామం వరకు డబుల్ రోడ్డు బ్రిడ్జ్ నిర్మాణం చేసుకుందామన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు ఉత్సవాలకు రూ. 50వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955